

యానాంలో ఇటీవల రూ.18 వేలకు విక్రయించిన పులస

ఆదివారం ప్రత్యేకం



యాండే.. పులసండే..

- గోదారి ఎర్రనీట్లో సందడి చేస్తోన్న పులస చేప
- గతంతో పోల్చితే ఇవి అరుదుగా దొరుకుతుండడంతో భారీ ధర
- ఇటీవల రూ.18 వేలు పలికిన కేజీన్నర చేప.. గతేడాది ఏకంగా రూ.25 వేలు
- సీజన్ ప్రారంభమవడంతో ఈ దఫా అయినా భారీగా దొరికేనా అని మత్స్యకారుల్లో ఆశ

పులస... పులసోయ్ పులస... నోరూరించే పులస.. పుస్తెలమ్మయినా కొనుక్కుని తినాల్సిన పులస.. సాధారణంగా ఏ స్వీట్లు గురించో వింటే రక్కున నోరూరుతుంది.. చేపల్లో పులస గురించి వింటే జిహ్వాచాపల్యం ఆగదు.. ఎలాగైనా.. ఎంత పెట్టి కొని అయినా తినాలనిపించే ఈ చేప గురించి ఎంత చెప్పినా తక్కువే.. వర్షాకాలం వస్తే గోదావరికి ఎర్రనీరు ఎలా పోటెత్తుతుందో... పులస కూడా అలా సముద్రం నుంచి గోదావరికి ఎదురీది పులస ప్రియుల నోట్లోకి జారుతుంది.. సాధారణంగా చికెన్..మటన్.. చేప తింటే బయటకొచ్చి దీని గురించి ఎవరూ పెద్ద గొప్పగా చెప్పుకోరు.. కానీ పులస తిన్నవాళ్లు మాత్రం రోజుల తరబడి ఊరంతా చెప్పుకోవడం ఓ ప్రెస్టేజీ కూడా.. గోదారోళ్లకు మహా ఇష్టమైన...ఖరీదైన.. చుట్టాలు, స్నేహితులకు గొప్ప గిఫ్ట్‌లా పేరొందిన పులస సీజన్ ఇప్పుడు గోదావరిలో మొదలైంది. భారీ వర్షాలతో వరద పోటెత్తుతుండడంతో ఒక్కో పులస అలా అలా ఈదుకుంటూ పులసప్రియుల నోటికి చిక్కడానికి ఇప్పుడిప్పుడే కదులుతోంది... పదండి... ఇంకా దీని గురించి చెప్పుకుందాం...

(కాకినాడ/యానాం-ఆంధ్రజ్యోతి)

వానాకాలం వస్తే అందరి నోట్లో నానే పదం పులస. ఇప్పుడు వానాకాలం కావడంతో గోదావరి ఎర్రనీరు సముద్రంలో కలుస్తుండడంతో పులసల సీజన్ మొదలైపోయింది. ఇప్పటికే యానాం గౌతమి గోదావరిలో అక్కడక్కడా పులసలు దొరుకుతున్నాయి. ఇటీవల యానాం మార్కెట్‌లోకి పలువురు వ్యాపారులు పులసలను తెచ్చి విక్రయించారు. వేలు ఖర్చుపెట్టి మరీ ఈ చేపలు కొనేందుకు ఎగబడ్డారు. వాస్తవానికి పుస్తులమ్మయినా పులస తినాలి అనేది గోదావరి జిల్లాల్లో పులస చేప కోసం వినబడే నానుడి. ఎందుకంటే దీని ధర ఎంతకు ఎగబాకుతుందో ఎవరికీ తెలియదు. చేపలను మార్కెట్లో ఇలా వెళ్లి అలా తెచ్చుకోవచ్చు.. కానీ పులసను మాత్రం వేలంలోకి వెళ్లి తెచ్చుకోవాలి. ఎందుకంటే దీనికి ఉన్న గిరాకీ అంత మరి. ధనవంతుల నుంచి సెలబ్రిటీల వరకు... మధ్యతరగతి నుంచి సామాన్యుల వరకు పులస వచ్చిందా.. పులస దొరుకుద్దా.. అంటూ ఈ సీజన్‌లో ఆరా తీయడం మామూలుగా ఉండదు. చాలామంది తమ పనుల కోసం ప్రముఖులను ప్రసన్నం చేసుకునేందుకు, కావాల్సిన పనులను చేయించుకునేందుకు ఈ పులస పులను పంపడం ఓ ఆనవాయితీగా మారింది. అంతేకాదండోయ్.. ఈ సీజన్‌లో విదేశాల్లో ఉన్న గోదావరివాసులు తమ వారితో సరదాగా పులస దొరికిందా.. పులస తిన్నారా అని అడగకుండా ఉండరంటే అతిశయోక్తికాదు.

పులసే తినాలా...

అవును.. పులసే తినాలి... ఇది తింటే ఆ రుచే వేరు.. వాస్తవానికి ఇవి వెండి రంగులో ఉంటాయి. ఆరోహక వలస జాతికి చెందిన పులసలు సాధారణంగా సముద్రంలో జీవిస్తాయి. అయితే సంతాన ఉత్పత్తి కోసం ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, టాంజానియా వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చి హిందూ మహాసముద్రంలో ప్రవేశించి అక్కడ నుంచి బంగాళాఖాతం గుండా వరదల సమయంలో గోదావరిలోకి వచ్చి చేరతాయి. గోదావరి వరదనీరు వచ్చి సముద్రంలో కలిసే సమయంలో గుడ్లు పెట్టిన తర్వాత అక్టోబర్ నాటికి తిరిగి సాగరానికి చేరుకుంటాయి. అలా వెళ్లే క్రమంలో జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వరదలు వచ్చినప్పుడు కొన్ని చేపలు సముద్రం నుంచి గోదారిలో ఎదురీదుకుంటూ వెళ్తూ జాలర్లకు చిక్కుతాయి. పూర్వం సముద్రంలోంచి ఈదుకుంటూ ధవళేశ్వరం బ్యారేజీ వరకు వెళ్లేవి. బ్యారేజీ దిగువన పులసల్లంక అనే లంక కూడా ఉంది. అరుదైన ఈ పులస చేపలు గోదావరిలో తప్ప ఇంకెక్కడా దొరకవు. అందుకే అంత గిరాకీ. వాస్తవానికి పులస సముద్రంలో ఉంటే విలస చేప.. నదిలో దొరికితే పులస అవుతుంది. గత పది రోజుల నుంచి గౌతమి గోదావరిలోకి ఎర్రనీరు రావడంతో పులసలు వచ్చి పడుతున్నాయి. వాస్తవానికి ఈ పులస యానాం వద్ద సముద్రం నుంచి ఎగువకు గోదావరిలో ఎగబాకుతూ ధవళేశ్వరం వరకు ఎదురెళ్తాయి. ఈ క్రమంలో ఎక్కడ మత్స్యకారులకు చిక్కుతుందో తెలియదు. చిక్కిందంటే పంట పండినట్టే.

ఎన్ని ప్రత్యేకతలో..

నదీ ప్రవాహానికి అతివేగంగా ఎదురీదడం ఈ చేప ప్రత్యేకత. పులస చనిపోయినా రెండు రోజుల వరకు కూడా పాడవకుండా ఉండటం మరో విశేషం. అయితే ఈ పులస చేప ధర వేలం పాటలో పాల్గొన్న వ్యక్తుల ఆధారంగా రేటు పెరుగుతుంది. సముద్రానికి దగ్గరగా ఉండే యానాం, కోనసీమ ప్రాంతాల్లో కిలో చేప రూ.25 వేలకు కూడా వెళ్తుంది. ప్రధానంగా అల్లవరం మండలం రెబ్బనపల్లికి చెందిన చేపల వ్యాపారి సాయి ఏటా పులస చేపల వ్యాపారం చేస్తారు. ఇతడికి అనేకమంది నేతలు, ప్రముఖులు ముందే అడ్వాన్సులు ఇచ్చేసి చేప చేజిక్కించుకుంటారు. గతేడాది జూలైలో కోనసీమ జిల్లా వశిష్ఠ గోదావరిలో మలికిపురం మండలం రామరాజులంక గంగపుత్రులకు వలలో కేజీన్నర చేపపడగా రూ.25వేల ధర పలికింది. తాజాగా జూలై 12న యానాం వద్ద కేజీన్నర చేప రూ.18 వేలు పలికింది. గోదావరిలో తీపి నీరు, సముద్రంలో ఉప్పునీరు కలవడంతో ఈ చేప శరీరతత్వం మారుతుంది. అందుకే అంత రుచి. సముద్రం నుంచి గోదావరిలోకి ఎదురీదుకుంటూ వెళ్లడం వలనే పులసలకు అంత టేస్ట్. ఈ పులస చేపల్లో ఆడ, మగ చేపలుండగా, వీటిలో ఆడ చేపకు ధర ఎక్కువ. ఇక పులసను రకరకాలుగా వండి జిహ్వాచాపల్యం తీర్చుకుంటారు. కొందరు వంకాయ, బెండకాయ కలిపి వండుతారు.

అంతకంతకూ మాయం..

కొన్నేళ్లుగా గోదావరిలో పులస లభ్యత తగ్గిపోయింది. సముద్ర జలాలు కాలుష్యం కావడం, చమురు సంస్థల డ్రెడ్జింగ్ వల్ల అనేక చేపలు మరణిస్తున్నాయి. అటు సముద్రం, గోదావరి కలిసే మొగ ప్రాంతంలో ఇసుక మేటలు పేరుకుపోవడంతో పులస గోదావరిలోకి రావడం తగ్గిపోతోంది. అలాగే మత్స్యకారులు భారీ వలలతో వేటాడే సమయంలో తల్లి పులసలు చిక్కడంతో సంతానం తగ్గిపోతోంది. అందుకే వలకు గుడ్డుతో ఉన్న తల్లి చేప కనిపిస్తే నదిలో వదిలేయాలని మత్స్యశాఖ ఎప్పటినుంచో ప్రచారం చేస్తోంది. వాస్తవానికి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 2010కి ముందు సరాసరి సీజన్‌లో మూడు టన్నుల పులస చిక్కేది. కానీ ఇప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు క్వింటాళ్లకు పడిపోయింది. వాస్తవానికి కోనసీమ జిల్లాలో యానాం వద్ద, రాజోలు మార్కెట్ పులసలకు పెట్టింది పేరు. కానీ ఎప్పుడోగానీ పులస జాడ ఉండడం లేదు. ఈ ఏడాది ఆరంభంలోనే పులస దొరకడంతో ఈ దఫా చేప లభ్యత పెరిగే అవకాశం ఉందని మత్స్యకారులు ఆశిస్తున్నారు.

విలసలకూ యమా డిమాండు

పిఠాపురం/మండపేట, జూలై19: కొంచెం అదే రుచి, అదే మాధుర్యం, పట్టిపట్టి చూస్తేనే కాని తెలుసుకోలేని వైరుధ్యం. అదే ఒడిశా పులస. గోదావరి పులసలను వేలల్లో పెట్టి కొనలేని వారు వీటిని కొని వండుకుంటారు. ఇప్పుడిప్పుడే విలసల విక్రయాలు మొదలయ్యాయి. ఒడిశా ప్రాంతంలో సముద్ర తీరప్రాంతాల్లో చెరువులు తవ్వి పెంచే పులస జాతి చేపలను ఒడిశా పులసలుగా, ఇలసలుగా పిలుస్తారు. కొందరు సముద్రంలో దొరికే విలసలనూ విక్రయిస్తారు. గోదావరి పులస రూ.5 వేల నుంచి పాతిక వేలు ఉంటే, ఒడిశా పులస మాత్రం సైజును బట్టి రూ.500 నుంచి రూ.1500 వరకూ మాత్రమే ఉంటుంది. కొందరు వీటినే పులసలుగా చెప్పి విక్రయించి మోసగిస్తారు. హోటళ్ల వారూ వీటినే పులసలుగా వండి వడ్డిస్తారు.



విలసల విక్రయం

నేడు ఏపీపీఎస్సీ రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

45 నిమిషాల ముందే రావాలి: జేసీ

రాజమహేంద్రవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో లెక్చరర్ పోస్టుల భర్తీకి ఆదివారం నిర్వహిస్తున్న పరీక్షకు అన్ని శాఖల సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశామని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు పేర్కొన్నారు. ఈ పరీక్షలు రెండు షిఫ్టుల్లో జరుగుతాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ జరిగే పరీక్షకు 519, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ నిర్వహించే పరీక్షకు 240 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్‌తో పాటు తగిన గుర్తింపు కార్డుతో పరీక్ష ప్రారంభ సమయానికంటే 45 నిమిషాల ముందే పరీక్షా కేంద్రం వద్ద హాజరు కావాలని ఆయన సూచించారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లకు అనుమతి ఉండదన్నారు. అభ్యర్థుల కోసం ఆయా రూట్లలో బస్సులను నడపాలని, రిక్వెస్టు స్టాపులను ఏర్పాటుచేయాలని ఆర్టీసీ అధికారులను జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో సీతారామమూర్తి, ఆర్డీవో కృష్ణనాయక్, ఏపీపీఎస్సీఅధికారి ఎం.జగదీశ్ పాల్గొన్నారు.



కలెక్టర్ పి.ప్రశాంతి

అన్నదానాలకు అనుమతి తప్పనిసరి

స్వచ్ఛ రాజమహేంద్రవరం కోసమే ఈ నిర్ణయం
కలెక్టర్ పి. ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఎవరైనా దాతలు, ఎన్జీవోలు, స్వచ్ఛంద సేవా సంస్థలు అన్నదానాలు నిర్వహించాలంటే ఇకపై నగరపాలక సంస్థ అనుమతులు తప్పనిసరి అని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్వచ్ఛ రాజమహేంద్రవరం నిర్మాణంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. నగరంలో అన్నదానాలు చేయాలనుకునేవారు 48 గంటల ముందు తమతమ వార్డు సచివాలయాల్లో అనుమతులు తీసుకోవాలని సూచించారు. దీనివల్ల ప్లాస్టిక్ ప్లేట్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదంతోపాటు ఆయా ప్రాంతాల్లో ముందుగానే డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తద్వారా తిన్న ప్లేట్లు రోడ్ల పక్కన, సైడ్‌కాల్వలో పడవేయకుండా డస్ట్‌బిన్‌లలో పడవేయడం ద్వారా ఆ ప్రాంతంలో పారిశుధ్యాన్ని కాపాడిన వారవుతామన్నారు. ముఖ్యంగా పండగలవేళ ఇతర ముఖ్య సంప్రదాయక రోజుల్లో రోడ్ల మీద అన్నదానాలు ప్రసాదాలు, మజ్జిగ, మంచినీరు వంటివి ప్లాస్టిక్ గ్లాసుల ద్వారా పంచడం, తద్వారా ప్రజలు వాటిని రోడ్ల మీద పారవేయడం జరుగుతుందన్నారు. అలాగే గోదావరి గట్టు వెంబడి ప్లాట్‌ఫారంపై నివశిస్తున్న అనాథలు, అభాగ్యులకు కొందరు దాతలు ప్రతీరోజు టిఫిన్లు, భోజనం సరఫరా చేస్తుంటారని, కానీ వ్యర్థాలను అక్కడే పారవేయడంతో ఈ ప్రాంతం అపరిశుభ్రంగా మారుతోందన్నారు. అందువల్ల దాతలు, స్వచ్ఛంద సంస్థలు ఎవరైనా వితరణ చేసేముందు తమ వార్డు సచివాలయంలో పేరు, సంస్థ వివరాలు కచ్చితంగా నమోదు చేసుకోవాలని సూచించారు. నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖాధికారి అనుమతి ఇచ్చిన అనంతరం సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ సాయంతో ట్రాఫిక్‌కు అంతరాయం లేని ప్రదేశంలో అన్నవితరణ నిర్వహించుకోవాలన్నారు. అన్నదాన అనంతరం శానిటేషన్ సెక్రటరీకి సమాచారం అందిస్తే వ్యర్థాలను వాహనం ద్వారా సేకరించడం జరుగుతుందన్నారు. క్లీన్ రాజమహేంద్రవరంలో భాగస్వాములు కావాలని కోరారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ప్లాస్టిక్ కాలుష్యం నిర్మూలనకు ప్రజలు కలిసిరావాలి

స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ ప్లాస్టిక్ నిర్మూలన ర్యాలీలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జూలై19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలించడానికి ప్రజలంతా కలిసి రావాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలో మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ర్యాలీకి స్థానిక వై జంక్షన్ వద్ద కలెక్టర్ ప్రశాంతి జెండా ఊపారు. ఈ ర్యాలీ కంబాలచెరువు, దేవీచౌక్, గోకవరం బస్టాండ్ మీదుగా సుబ్రహ్మణ్యం మైదానం వరకు సాగింది. ఈ సందర్భంగా తొలుత కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి నెల ఒక్కో థీమ్‌తో కార్యక్రమం చేపడుతున్నామన్నారు. జూలై నెలలో 'ప్లాస్టిక్ వాడకాన్ని ఆపేద్దాం' అనే ఇతివృత్తంతో కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. పర్యావరణానికి సంబంధించి జరిగే అనర్థాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టినా ప్లాస్టిక్ వినియోగాన్ని ఆశించిన మేరకు తగ్గించలేకపోతున్నామన్నారు. ఇకనైనా దీనిపై ప్రతి ఒక్కరు దృష్టిసారించాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఇటువంటి కార్యక్రమాలు విజయవంతమవుతాయన్నారు. బయటికి వెళ్లేటప్పుడు ప్లాస్టిక్ కవర్లు బదులు జ్యూట్ బ్యాగులను, కాటన్ బ్యాగులను వెంట తీసుకువెళ్లాలని ప్రజలకు సూచించారు. ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నవారిపై రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తోందని చెప్పారు. ప్లాస్టిక్ ప్రత్యామ్నాయంగా రూపొందించిన వస్తువులను మెప్మాద్వారా అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. ఇటివల రాజమహేంద్రవరం నగర పాలక సంస్థకు స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డు లభించిందని, ఈ అవార్డు మన బాధ్యతను మరింత పెంచిందని చెప్పారు. నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పివి రామలింగేశ్వర్ మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టిక్ కవర్లు వినియోగించకుండా వెనక్కి తిరిగి ఇస్తే వారికి నగర పాలక సంస్థ ప్రోత్సాహక బహుమతిని అందజేస్తుందని చెప్పారు. ఇందుకోసం నగరంలో జాంపేట జంక్షన్, వీఎల్ పురం జంక్షన్, దానవాయిపేటలో ప్రత్యేక ఔట్‌లెట్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. తొలుత నిర్వహించిన ర్యాలీలో వివిధ శాఖల సిబ్బంది 'ప్లాస్టిక్ వద్దు- కాటనే ముద్దు', 'ప్లాస్టిక్ భూతం- పర్యావరణానికి హాని' అంటూ నినాదాలు చేశారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దామని వేసిన వేషధారణలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సందర్శించారా!

- సైన్స్ మ్యూజియం సందర్శనకు ధరలు నిర్ణయం
- ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.25
- ప్రైవేట్ విద్యార్థులకు రూ.40, పెద్దలకు రూ.50
- ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకూ అనుమతి
- ఇంకా దారిన పడని మ్యూజియం
- ఉద్యోగులూ అరకొరే

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సైన్సు మ్యూజియానికి సందర్శకుల సందడి మొదలైంది. ఈ మ్యూజియం చూసేందుకు ధరలు నిర్ణయించారు. ఈ మ్యూజియం ప్రతీ రోజూ ఉదయం 9 గంటలకు తెరుస్తారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ సందర్శకులకు అనుమతి ఉంటుంది. ప్రభుత్వ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25, ప్రైవేట్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.40, పెద్దలకు రూ.50 వంతున టికెట్ ధరలు నిర్ణయించారు. కానీ సరైన ప్రచారం, ప్లాన్ లేకపోవడం వల్ల ఇంకా పెద్దగా విద్యార్థులు రావడంలేదు. ఆది, శనివారాల్లో ఏదో కొద్ది మంది వస్తున్నారు. ఇక్కడ ఉద్యోగులు పూర్తిస్థాయిలో విధుల్లో చేరలేదు. కొందరు చేరి సెలవుల్లో ఉన్నారు. ఇక్కడ ఒక్క ఇన్‌చార్జి మాత్రమే ఉన్నారు. సెక్యూర్టీ, ఇతర స్వీపర్లు మాత్రం ఉన్నారు. ఈ మ్యూజియం విశేషాలను ఆయా ఆయా విద్యాసంస్థలలో ప్రచారం చేసినా, పర్యాటకులకు అవగాహన కల్పించినా బాగా సందర్శకులు వచ్చే అవకాశం ఉంది. కానీ అటువంటి ప్రయత్నాలు ఏమీ ఇక్కడ చేయకపోవడం గమనార్హం. వచ్చిన వారికి కూడా పూర్తిగా ఇక్కడి విశేషాలు వివరించేవారు కూడా లేకపోవడం గమనార్హం. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల విద్యార్థులకు ఉపయోగపడేలా రాజమహేంద్రవరంలోని బొమ్మూరులో విజ్ఞాన కేంద్రం (సైన్స్ మ్యూజియం)ను నిర్మించిన సంగతి తెలిసిందే. గత నెల 26న కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రషెకావత్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తదితరుల సమక్షంలో ఇది ప్రారంభమైన సంగతి తెలిసిందే. వాస్తవానికి గత పుష్కరాల సమయంలో కేంద్రం నుంచి తెచ్చిన హామీనే ఇది. గతంలోనే స్థల సేకరణ జరిగినా, టెండర్లు పిలిచినా, గత ప్రభుత్వ వైఖరి వల్ల ఆలస్యం అయింది. తర్వాత ఈ విజ్ఞాన కేంద్రాన్ని నిర్మించారు. 5 ఎకరాల స్థలంలో దీనిని నిర్మించారు. సుమారు రూ. 10 కోట్లతో నిర్మించారు. ఈ సైన్సు కేంద్రం ఓ అద్భుతం. సైన్స్ పరికరాలు, విజ్ఞాన సమాచారం, ప్రయోగశాలలు ఏర్పాటుచేశారు. ఈ భవనాన్ని జీప్లస్ 1గా నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో మూడు రూమ్‌లు ఉన్నాయి. ఫస్ట్ ఫ్లోర్‌లో 6 గ్యాలరీలు ఉన్నాయి. ఆడిటోరియం, కాన్ఫరెన్స్ హాల్ ఉంది. సాంకేతికపరమైన 18 ఎగ్జిబిషన్లు ఉన్నాయి. ఓపెన్ గ్రౌండ్‌లో సైన్సు పార్కు ఉంది. రన్నియాన్స్ గ్యాలరీలో ఫిజిక్స్, మాథ్స్‌కి సంబంధించిన 33 విజ్ఞాన అంశాలు ఉన్నాయి. అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ కోసం మరో నిర్మాణం కూడా చేయనున్నారు. వాటర్ వర్రీస్ గ్యాలరీలో వర్చువల్ మ్యూజియం, మరో 35 ఎగ్జిబిషన్లు ఉన్నాయి. సౌండ్ చిత్రాలు సేకరణ, ఖగోళ వస్తువులు, సాంకేతిక, శాస్త్రీయ, పారిశ్రామిక పురోగతికి సంబంధించిన 32 ప్యానెళ్లు ఉన్నాయి. ఎ జర్నీ విత్ లైట్ పై స్పేస్, గెలాక్సీ, గ్రహాలతో కూడిన 20 ప్యానెల్స్ ఉన్నాయి.

రైతులకు ఎరువుల పంపిణీ పారదర్శకంగా జరగాలి : కలెక్టర్ ప్రశాంతి

రాజానగరం,జూలై19(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువుల పంపిణీ వ్యవస్థలో పారదర్శకత ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టంచేశారు. రాజానగరం మండలంలోని తోకాడ, భూపాలపట్నం సహకార సంఘాల కేంద్రాల్లో శనివారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన ఎరువుల సరఫరా విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా 50 శాతం ప్రభుత్వరంగం, మరో 50 శాతం ప్రైవేటు రంగం ద్వారా పంపిణీ జరగాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతి యూరియా బస్తాపై రూ.1,542 సబ్సిడీ ఇస్తుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎరువులను దుర్వినియోగం చేయకుండా మండల స్థాయిలో రెవెన్యూ, వ్యవసాయ, హార్టికల్చర్, సహకార శాఖల అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి, నిత్యం పంపిణీపై పర్యవేక్షణ ఉండాలన్నారు. ఇతర జిల్లాలకు ఎరువులు తరలించకుండా, జిల్లాలో ఎరువుల వాస్తవ అవసరాలకు మేరకు సరఫరా నిర్ధారించాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమంగా ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామ/మండల స్థాయిలో ఎరువుల వినియోగంపై నమోదైన రికార్డులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఇప్పటికే నాట్లు వేసిన పంటలకు అవసరమైన ఎరువుల సరఫరా పూర్తిగా జరిగిందా లేదా అనే అంశాన్ని కూడా సమీక్షించాలన్నారు. ఒక ఎకరానికి ఎన్ని బస్తాలు యూరియా అవసరమవుతుందో రైతులను వ్యక్తిగతంగా అడిగి తెలుసుకున్నారు. అవసరానికి మించి ఎరువుల వినియోగం వ్యవసాయేతర అవసరాలకు వాడుతున్నట్టుగా తెలిసిందని, ఎరువులను దుర్వినియోగం చేసినట్టు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ డి.ప్రతాప్, రైతులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు కలెక్టర్ ప్రశాంతి వెంట ఉన్నారు.



ఎరువుల వినియోగంపై రైతును అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి



స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి దుర్గేష్, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు

ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం : మంత్రి దుర్గేష్

పెరవలి, జూలై19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకం ఆరోగ్యానికి, పర్యావరణానికి హానికరమని, కాబట్టి ప్రతీ ఒక్కరూ దీని వినియోగాన్ని తగ్గించాలని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం పెరవలి మండలం కానూరులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలంటూ ప్రజలతో కలిసి మానవహారం నిర్వహించారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ భావన మధు, డివిజనల్ పంచాయతీ అధికారి వై.అమ్మాజీ, ఎంపీడీవో కె.ఉమారాజ్యలక్ష్మి పద్మజ, తహశీల్దార్ కె. నిరంజన్, సీడీపీవో ఎం.ఆశా రోహిణి, పిప్పర రవి, వాకలపూడి వీర్రాజు, ముళ్ళపూడి రాజేంద్రప్రసాద్, కోలా సీతయ్య పాల్గొన్నారు. కాగా ఇటీవల మరణించిన కానూరు అగ్రహారానికి చెందిన జనసేన కార్యకర్త మెల్లరాజు కుటుంబానికి రూ.లక్ష విరాళం అందజేశారు.

ముద్రగడకు తీవ్ర అస్వస్థత

- కొంతకాలంగా అనారోగ్యం
- ఆసుపత్రిలో చేరిక

7

గోవిందా..ఈ జర్నీ సరైందా?



రాజమహేంద్రవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి గాంచిన ఆత్రేయపురం మండలంలోని వాడపల్లి వెళ్లే భక్తులు ప్రమాదం అంచున ప్రయాణం చేయాల్సి వస్తోంది. వాడపల్లికి చేరుకునే రైలు మార్గాన రాజమండ్రికి చేరుకుంటున్న భక్తులు రైల్వే స్టేషన్ నుంచి రోడ్డు మార్గాన ద్వారా ఆలయానికి వస్తున్నారు. శుక్రవారం రాత్రి వాడపల్లి వెళ్లిపోతే శనివారం ఉదయానికి దర్శనం అవుతుందని శుక్రవారం రాత్రి రైల్వే స్టేషనుకు చేరుకునే విధంగా ప్లాన్ చేసుకుంటున్నారు. అయితే రాజమండ్రి నుంచి వాడపల్లి వెళ్లేందుకు ప్రమాదకర ప్రయాణం చేస్తున్నారు. ఆటో మాత్రమే నడుస్తోంది. దీంతో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఒక్కో ఆటోలో 12 నుంచి 15 మందిని ఎక్కించుకుంటున్నారు. కనీసం కూడా కదపకుండా రాత్రి వేళ సుమారు గంటన్నర ప్రయాణించాల్సి వస్తోంది. ఏదైనా దుర్ఘటన జరిగిన తర్వాత పరుగులు కంటే ముందుస్తుగా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తే మంచిది అని పలువురు గుర్తు చేస్తున్నారు.

క్షణాల్లో ఘోరం.. విషాదం

- ఆటోను ఢీకొన్న మోటారు సైకిల్
- తెగిపడిన మహిళ తల
- యువకుడు మృతి
- కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం లక్ష్మీదేవిలంక సమీపంలో ఘటన

ఓ రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. మహిళ తల తెగి పడిన వైనం వెన్నులో వణుకు పుట్టించింది. క్షణాల్లోనే మహిళ, యువకుడి ప్రాణాలను హరించివేసింది. అసలు ఏం జరిగిందంటే..



సంఘటనా స్థలంలో బైక్, పరిశీలిస్తున్న పోలీసులు



ముమ్మిడివరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): 216 జాతీయ రహదారి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అన్నంపల్లి పంచాయతీ లక్ష్మీదేవిలంక సమీపంలో శనివారం ఘోర ప్రమాదం జరిగింది. ఐ.పోలవరం మండలం కేశనకుర్రు జై బుద్ధనగర్‌కు చెందిన పచ్చిమాల లక్ష్మి (49) ముమ్మిడివరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువులను పరామర్శించి ఇంటికి వెళ్లేందుకు ముమ్మిడివరం మార్కెట్ సెంటర్‌లో ఆటో ఎక్కింది. ఆటోలో మహిళతో పాటు వృద్ధుడు, మరో ఇద్దరు ప్రయాణికులు ఉన్నారు. ఆటో మురమళ్ల వైపు బయలుదేరింది. ఇంతలో ఆటో దాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను ఓవర్ టేక్ చేస్తుండగా ఎదురుగా లక్ష్మీదేవిలంక సమీపంలో యానాం వైపు నుంచి మోటారు సైకిల్‌పై వస్తున్న బొడ్డు రాంబాబు (24) ఆటోను ఢీకొన్నాడు. దీంతో ఆటోలో ఉన్న లక్ష్మి రోడ్డుపై పడింది. ఆటో వెనుక వస్తున్న దాన్యం లోడు ట్రాక్టరు ఆమె మెడ భాగం పై నుంచి వెళ్లడంతో తల భాగం తెగి 3 మీటర్ల దూరంలో పడగా శరీర భాగాలు నుజ్జునుజ్జు అయ్యాయి. రాంబాబు తీవ్రంగా గాయపడగా హైవే వాహనంపై అమలాపురం ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఆటోలో ఉన్న వృద్ధుడు కూడా స్వల్పంగా గాయపడ్డాడు. మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్ఐ డి.జ్వాలాసాగర్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కాగా పచ్చిమాల లక్ష్మికి భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా దిరుసుమర్రు శివారు పల్లిపాలెంకి చెందిన బొడ్డు రాంబాబు యానాం ప్రైవేటు ట్రావెల్స్‌లో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం యానాంలో విధులు ముగించుకుని తిరిగి మోటారుసైకిల్‌పై వస్తుండగా ఈ ప్రమాదంలో కన్నుమూశాడు. ఇద్దరు మరణించడంతో వారి కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

గంజాయితో నలుగురి యువకుల అరెస్ట్

మామిడికుదురు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా నగరంలో గ్రామంలో గంజాయితో నలుగురు యువకులను శనివారం నగరం పోలీసులు అరెస్టు చేశారు. గ్రామంలోని మాజీ ఎమ్మెల్యే నేతిపూడి గణపతిరావు సమాధుల వద్ద యానానికి చెందిన గణపతి వెంకటదుర్గ, పెద్దిరెడ్డి గోవిందరాజు, నాగుల్లంకకు చెందిన సుంకరపల్లి వెంకట్, మొగలికుదురు గ్రామానికి చెందిన పెమ్మాడి నాగూర్‌ను అదుపులోకి తీసుకుని వారి నుంచి 950 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ పేర్కొన్నారు. నిందితులను రాజోలు కోర్టులో రిమాండ్ కోసం హాజరుపరిచామని తెలిపారు.

చింతూరులో ముగ్గురు..

చింతూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చింతూరు పోలీసులు శనివారం 5 కిలోల గంజాయితో ముగ్గురు యువకులను అరెస్ట్ చేశారు. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ముగ్గురు యువకులు ఒడిస్సాలో 5 కిలోల గంజాయి కొనుగోలు చేసి వయా చింతూరు మీదుగా తెలంగాణకు తరలిస్తూ వాహన తనిఖీల్లో పట్టుపడ్డారని ఎస్ఐ రమేష్ పేర్కొన్నారు. రామవరానికి చెందిన మాలోత్ సాయినాథ్, తుంగారానికి చెందిన నేమాల కృష్ణ, వేల్పుల రాముని అదుపులోకి తీసుకుని ద్విచక్ర వాహనం, 4 ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

బాలికపై అత్యాచారం

ఉప్పలగుప్తం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలంలోని ఓ గ్రామంలో బాలికపై అదే గ్రామానికి చెందిన ఒక బాలుడు అత్యాచారం చేసినట్టు బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్, రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ ఎస్.రాజేష్ విచారణ చేపట్టారు.

మహిళ అదృశ్యంపై కేసు

తొండంగి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మహిళ అదృశ్యంపై కుటుంబ సభ్యులు రైల్వేపోలీసులకు ఫిర్యాదు చేశారు. కాకినాడ జిల్లా తొండంగి మండలం ఏకొత్తపల్లికి చెందిన వీర్ల సుబ్బలక్ష్మి (60) హైదరాబాద్ మల్కాజిగిరిలోని నుమారు 15 ఏళ్లుగా పని చేస్తోంది. ఈ నెల 13న మల్లవరంలో బంధువుల ఇంట జరిగిన వేడుకకు వచ్చింది. తిరిగి హైదరాబాద్ వెళ్లేందుకు ఈనెల 14న అన్నవరం రైల్వేస్టేషన్‌లో కాచిగూడ ఎక్స్‌ప్రెస్ రైలులో ఆమె సోదరుడు ఎక్కిరెడ్డి ఎక్కించారు. మరుసటి రోజు ఆమెకు ఫోను చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. ఆచూకీ తెలియలేదు. దీంతో ఆమె భర్త వీర్ల రాజోలు శనివారం రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జీశ్రీనివాసరావు పేర్కొన్నారు.

వాడపల్లి వెంకన్న దర్శనానికి వచ్చి...
గోదావరిలో ఇంజనీరింగ్ విద్యార్థి గల్లంతు

ఎస్డీఆర్ఎఫ్ బృందం గాలింపు చర్యలు



పడవపై గాలింపు చేపడుతున్న ఎస్డీఆర్ఎఫ్ బృందం



దినేష్ (ఫైల్)

ఆత్రేయపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వెంకన్న దర్శనానికి వచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థి గోదావరిలో గల్లంతయ్యాడు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా వెంసూరు మండలం లచ్చన్నగూడెంకి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి పామర్తి దినేష్ (22) ఆరుగురు మిత్రులతో కలిసి సత్తుపల్లి నుంచి కారులో శుక్రవారం రాత్రి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం వాడపల్లి వెంకన్న దర్శనానికి బయలుదేరారు. శనివారం వాడపల్లికి చేరుకున్న వారు తెల్లవారుజామున 5 గంటలకు ఆలయంలోకి సమీపంలో ఉన్న గోదావరి నదిలో స్నానానికి దిగారు. అక్కడే ఉన్న పడవపై ఎక్కి కేరింతలు కొట్టారు. దినేష్‌కు ఈత రాకపోవడంతో అక్కడిక్కడే మునిగి గల్లంతయ్యాడు. మిత్రులతో పాటు స్థానికులు దినేష్‌ను కాపాడే ప్రయత్నంచేశారు. ఈ విషయాన్ని ఆలయ సమాచార కేంద్రం వద్దకు తెలియచేయడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యారు. ఈవో నల్లం సూర్యచక్రధరరావు విధి శాఖ అధికారులను అప్రమత్తం చేశారు. వారందరూ ఘటన స్థలానికి చేరుకున్నారు. విశాఖపట్నం 16వ బెటాలియన్ ఆర్ఎస్ఐ వెంకటేష్ ఆధ్వర్యంలో ఎస్‌డీఆర్ఎఫ్ బృందం, గజ ఈతగాళ్ళు, పోలీస్ సిబ్బంది గల్లంతైన దినేష్ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, మిత్రులు వాడపల్లి చేరుకుని తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అక్కడికి చేరుకుని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. దినేష్ సోదరుడు శ్రీహరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రాము తెలిపారు.

తారాస్థాయికి పెద్దింట్లమ్మ ఆలయ వివాదం

పోలీసుల అదుపులో ఎన్నారై



వెంకటపతిరాజును అదుపులోకి తీసుకున్న పోలీసులు

అంతర్వేది, జూలై 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం సఖినేటిపల్లి మండలం మెండుపాలెం (చిన్నకొల్లేరు) గ్రామంలో శ్రీపెద్దింట్లమ్మ ఆలయ వివాదం తారాస్థాయికి చేరింది. అమ్మవారి దూపదీప నైవేద్యాలు, ఉత్సవాలు గ్రామస్తులతో నిర్వహించబడేవి. ఇటీవల గ్రామస్తులు 2 వర్గాలుగా మారడంతో ఉత్సవాలు వివాదానికి దారి తీశాయి. వెంటనే ఆర్డీవో, డీఎస్పీ స్థానిక ఎస్ఐ సమక్షంలో వారికి సర్దిచెప్పినా వినిపించుకోలేదు. ఆలయాన్ని 7 నెలల క్రితం దేవదాయశాఖకు అప్పగించి వారికిరంగా వచ్చే జాతర మహోత్సవాలు నిర్వహించారు. ప్రస్తుతం ఎండోమెంట్ ఆర్డరును రద్దు చేసి మళ్లీ సింగిల్ కమిటీని నియమించి ఒక వర్గం వారికి అప్పగించారు. రెండో వర్గంవారు వచ్చి పోలీసులను అడగ్గా ఆర్డర్ కాపీ ఉన్నదని చెప్పి వారు చూపించకపోవడంతో ఇరు వర్గీయుల మధ్య వివాదం జరిగిఉండగా ఉందని 50మంది పోలీసు సిబ్బందితో వారికి శనివారం ఉదయం సర్ది చెప్పారు. అలయ ఆవరణలో చండీహోమం, శాంతిహోమం, అన్నదానం నిర్వహించేందుకు, ఆలయాన్ని శుద్ది పరిచేందుకు ఒక వర్గానికి చెందినవారు రావడంతో పోలీసులు ఆలయం వద్ద మోహరించారు. ఆదివారం నిర్వహించే కార్యక్రమాలకు పోలీసులు అనుమతులు నిరాకరించడంతో శనివారం మధ్యాహ్నం పోలీసుస్టేషన్‌లో ఎన్నారై యెనుముల వెంకటపతిరాజుతో కలిసి ఒక వర్గం వర్గీయులు పోలీసుస్టేషన్ ముందు బైఠాయించారు. నిరసన వ్యక్తం చేస్తున్న వెంకటపతిరాజు, వర్గీయులు, పోలీసులకు తోపులాట జరిగింది. కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, సీఐ నరేష్ ఘటనా స్థలానికి చేరుకుని వెంకటపతిరాజు, 21 మంది యువకులు, మహిళను అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీసు వాహనాల్లో వేరే ప్రదేశాలకు తరలించారు.

ముద్రగడకు తీవ్ర అస్వస్థత

కిర్లంపూడి, జూలై 19(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, వైసీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభం అస్వస్థతకు గురయ్యారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన 2రోజుల క్రితం కాకినాడలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు. షుగర్ లెవల్స్ పడిపోవడంతో శనివారం రాత్రి ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారని సమాచారం. దీంతో ముద్రగడను కాకినాడ మెడికోవర్ ఆస్పత్రికి తరలించాలన్న వైద్యుల సూచన మేరకు కుటుంబీకులు అక్కడ చేర్పించినట్టు తెలిసింది. అవసరమైతే ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు తరలించే అవకాశం ఉందని తెలిసింది.

ఆదాయ వనరుల లక్ష్యాల సాధనకు ప్రణాళికలు

మున్సిపల్ ఆర్డీ నాగనరసింహారావు

సామర్లకోట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో ఆదాయ వనరుల వసూళ్ల లక్ష్యాలు సాధించేందుకు సరికొత్త ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని మున్సిపల్ ఆర్డీ నాగనరసింహారావు వెల్లడించారు. శనివారం కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆర్డీ మాట్లాడుతూ తన రీజియన్ పరిధిలో 7 జిల్లాలకు చెందిన 34 మున్సిపాల్టీలు, నగర పంచాయతీలు ఉన్నాయని ప్రతినెలా ఆయా మున్సిపాల్టీల్లో అధికారుల పనితీరుపై సమీక్షిస్తూ మెరుగైన ఫలితాల సాధనకు చేపట్టాల్సిన చర్యలను నిర్దేశించడం జరుగుతుందన్నారు. గతంలో ప్లాన్ అనుమతులు పొంది నిర్మించిన భవనాలు తదనంతరం మరిన్ని అంతస్తులు నిర్మించడం లేదా భవన వినియోగాన్ని పెంచడం వంటి పనులకు బిల్డింగ్ పెనాల్టీ స్కీం ద్వారా చర్యలు చేపడుతున్నామన్నారు. ట్రేడ్‌లైసెన్స్ రుసుములు వసూళ్ళు, అడ్వర్‌టైజ్‌మెంట్ హోర్డింగ్‌పై పన్నుల సత్వరం వసూళ్లు నిర్వహించేందుకు లక్ష్యాలు నిర్దేశిస్తున్నామన్నారు.

'న్యాయ సలహా అనంతరం చర్యలు తీసుకుంటాం'

అన్నవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో కార్మికులకు ఈపీఎఫ్ మొత్తం చెల్లించకుండా నకిలీ రసీదులతో అధికారులను బురిడీ కొట్టించిన వ్యవహారంపై న్యాయసలహా కోరి తదుపరి చర్యలు తీసుకుంటామని ఈవో వీర్ల సుబ్బారావు తెలిపారు. శనివారం అన్నవరం సత్యదేవుని దర్శనానికి విచ్చేసిన పీఎఫ్ అధికారులతో ఈవిషయంపై చర్చించారు. దీనికి సంబంధించి చర్యలపై ఏవిధంగా ముందుకెళ్లాలని కోరగా రాజమండ్రి కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని అనంతరం న్యాయసలహాతో సంబంధిత కాంట్రాక్టర్‌పై ఏ చర్యలు తీసుకోవాలో సంగతులను నిర్ణయం వెలువడుతుందన్నారు.

డ్వాక్రా యానిమేటర్ అరెస్ట్

కిర్లంపూడి, జూలై 19(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా సొమ్మును కాజేసిన యానిమేటర్‌ను శనివారం కిర్లంపూడి పోలీసులు అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన దుర్గ డ్వాక్రా యానిమేటర్‌గా పనిచేస్తూ 42 డ్వాక్రా గ్రూపులకు ఇన్‌చార్జిగా ఉంది. బూరుగుపూడిలో 12 గ్రూపులకు 2023లో స్త్రీనిధి ద్వారా లోను ఇప్పించి 8 గ్రూపు సభ్యులకు వేరే డబ్బులు మీ ఖాతాలో పడ్డాయని చెప్పి వారి సంతకాలు, వేలిముద్రలు తీసుకుని వారి వద్ద రూ.20.25లక్షలు కాజేసి గ్రామం వదిలి పారిపోయింది. దీనిపై మే 24న కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, కిర్లంపూడి ఎస్ఐ జి.సతీష్, సిబ్బంది దర్యాప్తు చేసి నిందితురాలు దుర్గను అరెస్టు చేసి ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరిచారు. ఆమెకు కోర్టు 14 రోజులు రిమాండ్ విధించింది.

గైట్ అటానమస్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



వేదికపై ముఖ్యఅతిథితో పాటు జేఎన్‌టీయూ చాన్సలర్ చైతన్యరాజు

రాజానగరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని జీఎస్ఎల్ ప్రాంగణంలోని గైట్ అటానమస్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే-2025 వేడుకలను శనివారం జరిగాయి. బెంగుళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ)పూర్వ డిప్యూటీ డైరెక్టర్ ఆచార్య జయంత్ ఎం.మోడక్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. మన దేశంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో ప్రకారం ప్రాథమిక స్థాయి నుంచి సెకండరీ స్థాయి వరకు 25కోట్ల మంది విద్యను కొనసాగిస్తున్నారు. హైస్కూల్ అనంతరం 66శాతం మంది మాత్రమే విద్య కొనసాగిస్తున్నారు. ఉన్నత విద్యను పూర్తి చేసే వారు 25శాతం మాత్రమే ఉన్నారన్నారు. ఈ సంఖ్యను జాతీయ విద్యా విధానం 2020 ప్రకారం 50శాతానికి పెంచే లక్ష్యంతో ముందు కెళ్తున్నామన్నారు. సమగ్రత, సహకారం, వివరణాత్మకత, బాధ్యత, సృజనాత్మకత అనే ఐదు భవిష్యత్ విజయానికి మూల స్తంభాలన్నారు. మరో ముఖ్యఅతిథి జేఎన్‌టీయూ ఛాన్సలర్ చైతన్యరాజు మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ ప్రోఛాన్సలర్ కె.శశికి రణ్ వర్మ, ఉపకులపతి యు. చంద్రశేఖర్, ప్రొ వైస్ ఛాన్సలర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పీఎంఎస్ శర్మ, ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో సీతారాముల కల్యాణోత్సవం



కల్యాణమూర్తులు

ద్రాక్షారామ, జూలై 19(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో భీమేశ్వరాలయ బాహ్యప్రాంగణంలో ప్రసన్నాంజనేయస్వామి సన్నిధిలో భద్రాది సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నులపండువగా జరిగింది.ప్రసన్నాంజనేయ బాలకృష్ణ సమాజం ఆధ్వర్యంలో జరుగుతున్న సప్తసప్తాహం ముగింపు సందర్భంగా నిర్వహించిన సీతారాముల కల్యాణాన్ని వందలాది మంది భక్తులు తన్మయత్వంతో తిలకించారు. ఉదయం రథమూ త్తులను కల్యాణ వేదికపై అధిష్టించారు. అనంత రం గణపతి పూజ, కంకణ, యజ్ఞోపవీత ధారణ తదుపరి సుముహూర్తం జరిపారు. మాంగల్యధారణ అనంతరం తలంబ్రాలు కార్యక్రమం నిర్వహించారు. భద్రాది ఆలయ ఉపప్రధానార్చకుడు ఏ.వెంకట శ్రీ నివాస రామానుజాచార్య ఆధ్వర్యం లో వేదపండితులు స్వామి కల్యాణాన్ని వేద మంత్రాలతో జరిపించారు. సీతారామస్వామికి భీమేశ్వరాలయ సహాయ కమిషనరు ఏపీ ఐ దావాణి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు.కార్యక్రమంలో భద్రాది ఆలయ ఈవో ర మాదేవి, మంచం చినబాబు దంపతులు పాల్గొన్నారు. కల్యాణోత్సవం అనంతరం అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో బాలకృష్ణ సమా జం అధ్యక్షుడు బోనం శ్రీనివాస్ పాల్గొన్నారు.



భక్తులకు మంగళసూత్రం చూపుతున్న అర్చకస్వామి

ఏపీఎస్ఐడీసీ నుంచి మరో మూడు ఎత్తిపోతలు

రాజమహేంద్రవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ద్వారా ఉమ్మడి తూర్పుగోదా వరి జిల్లాలో మరో మూడు ఎత్తిపోతల పథకా లు నిర్మించనున్నారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీ మ జిల్లా అన్నంపల్లిలో రూ.60 కోట్లతో 4045 ఎకరాల ఆయకట్టకు నీరిచ్చేలా పథకాన్ని ని ర్మించనున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం తిమ్మాపురంలో రూ.70 కోట్లతో 7,800 ఎకరాల ఆయకట్టకు నీరందించే ప్రాజెక్టును నిర్మించనున్నారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి మొల్లేరు, మల్లవరం, గోవిందపురం గ్రామాల పరిధిలో 9,000 ఎకరాల ఆయకట్టు కోసం మొల్లేరు ఎత్తిపోతల నిర్మిస్తున్నారు. ఇది గోకవరం మండలంలో కొత్త, కాకినాడ జిల్లాలో కొంత, ఏజెన్సీ ప్రాంతంలో కొంత మేర విస్తరిం చి ఉంది. దీనికి ఇప్పటికే రూ.136కోట్లు రాగా, రూ.10 కోట్లు ఖర్చు చేశారు. కానీ ధరలు పెరగ డం వల్ల తమకు గిట్టుబాటు కావడంలేదని, కొత్త ఎస్ఎస్ఆర్ రేట్ల ప్రకారం డబ్బు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టర్ పని ఆపే శాడు. కానీ ఇటీవల కేబినెట్‌లో ఈ పథకాన్ని నిర్మించడానికి ఆమోదించారు. ఈ విషయాన్ని డీఈ పి.దుర్గాప్రసాదు తెలిపారు.

ముగిసిన ఏపీఈఏపీసెట్ వెబ్ ఆప్షన్ల నమోదు

- కాకినాడలో రెండు సహాయ కేంద్రాలు
- ఆన్‌లైన్‌లో మొత్తం 5,590 మంది విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన
- ఈనెల 22న సీట్ల కేటాయింపు

జేఎన్‌టీయూకే, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీసెట్-2025 అడ్మిషన్లకు ఎంపీసీ విభాగం అభ్యర్థులకు సంబంధించిన ఆన్‌లైన్ వెబ్‌కౌన్సెలింగ్ ఈనెల 7 ప్రారంభమైంది. 16వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ జరుగగా, ధ్రువపత్రాల పరిశీలన ఆన్‌లైన్‌లో 17వరకూ కొనసాగింది. ఈఏపీసెట్ షెడ్యూల్ ప్రకారం శుక్రవారంతో విద్యార్థుల వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ముగియగా శనివారం విద్యార్థులు వెబ్ఆప్షన్లను మార్పుచేసుకున్నారు.

● ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా కాకినాడ జగన్నాధపురం ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాల సహాయకేంద్రంలో వారికి కేటాయించిన 1439 మంది విద్యార్థుల ధ్రువపత్రాలకుగాను 1434 మంది ధ్రువపత్రాలను, కాకినాడ జేఎన్‌టీయూకేలోని యూనివర్శిటీ గల సహాయ కేంద్రంలో వారికి కేటాయించిన 4167 మంది విద్యార్థుల ధ్రువపత్రాలకుగాను 4156 మంది ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో పరిశీలించారు.

మిగతా షెడ్యూల్ ఇదే...

● సీట్ల కేటాయింపు జూలై 22న జరుగుతుంది. ఈనెల 23నుంచి 26వరకూ ఆయా కళాశాలల్లో రిపోర్టింగ్ చేయాలి. ఆగస్టు 4వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

రూ. 66.27 లక్షల ఆదాయం

ఆత్రేయపురం, జూలై 19(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తజనం పోటెత్తారు. మం దుటెండలో గంటల తరబడి ఆశేష భక్తజనం స్వామివారిని దర్శించుకున్నారు. వేకువ జామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మీహోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పా లతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్లు స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. శాసనమండలి సభ్యుడు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు దంపతులు, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. తొలుత వారిని ఆర్చకబృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని వేదాశీర్వచనం అందుకున్నారు. స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు స్వీకరించారు. వివిధ సేవల ద్వారా శనివారం స్వామివారికి రూ.66,27,595లు ఆదాయం లభించినట్టు ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

సామాజిక సేవకుడు ఆంజనేయరెడ్డికి ఆంధ్రశ్రీ బిరుదు

సర్పవరంజంక్షన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రెండున్నర దశాబ్దాలుగా ప్రజల దాహార్తిని తీరుస్తున్న సామాజిక సేవకుడు, నంది అవార్డు గ్రహీత ఆనపాల ఆంజనేయరెడ్డికి ఆంధ్రశ్రీ బిరుదును పొట్టి శ్రీరాములు సోషియో కల్చరల్ అసోసియేషన్ ప్రకటించింది. ఈమేరకు శనివారం విజయవాడ బలుసుపాడు కన్వెన్షన్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు సోషియో కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు అడ్డంకి రాజా ఆధ్వర్యంలో నిర్వహించిన అమరావతి కీర్తి పురస్కార అవార్డుల ప్రదానోత్సవంలో ఆనపాల ఆంజనేయ రెడ్డిని మాజీ మంత్రి కేఎస్ జవహర్ ఘనంగా సత్కరించి, ఆంధ్రశ్రీ బిరుదు అవార్డును బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీ వేదానే పోరాడుగా ప్రజల జీవిత ధాహార్తిని తీర్చడమే కాకుండా ఇద్దరు ఐదేళ్లుగా పరిలేద్దరం నిర్వహిస్తున్న ఆంజనేయ రెడ్డిని అభినందించారు. వివిధరంగాల్లో సేవలు అందించిన వారిని గుర్తించి, పలుఅవార్డులతో ప్రో త్సహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.



ఆంజనేయరెడ్డిని సత్కరిస్తున్న రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్

ప్రజాలోచనలకు తగినట్టు అభివృద్ధి పనులు



శిలా ఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆలోచనలకు తగ్గట్టుగా నగరంలో అభివృద్ధి పనులు చేస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. శనివారం స్థానిక 10వ డివిజన్‌లో గాదాలమ్మ నగర్ మొదటి వీధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నగర అభివృద్ధి కుంటుపడిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక నిత్యం ప్రజల్లో ఉంటున్నామని వారి అవసరతలను తెలుసుకుని వాటిని తీరుస్తున్నామన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి నగరంలో నీటమునిగే ప్రాంతాల సమస్య పరిష్కరించే దిశగా పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి చొప్పెర్ల వీరభద్రరావు, నాయకులు వాసిరెడ్డి బాబి, మహ్మద్‌ఖాన్, అప్పారావు, బాలు, శ్రీనివాస్, ఉమామహేశ్వరి పాల్గొన్నారు. అలాగే ఇటీవల జేఈఈ అడ్వాన్స్ ఓపెన్ కేటగిరిలో జాతీయ స్థాయిలో 386వ ర్యాంక్, ఈడబ్ల్యూఎస్‌లో 21వ ర్యాంక్ సాధించిన నగరానికి చెందిన ముదునూరి మణిదీప్‌వర్మను ఎమ్మెల్యే వాసు అభినందించారు. గాదాలమ్మనగర్‌లో అతడి ఇంటికెళ్లి సత్కరించారు.

ఎస్‌కేవీటీలో డిగ్రీ ఫస్టియర్ అడ్మిషన్లు

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫస్టియర్ డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభిస్తున్నామని, విద్యార్థులు కళాశాలను సంప్రదించి ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలని కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపణ్యం తెలిపారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేస్తూ, 2025-26 విద్యాసంవత్సరానికి సుమారు 21 కోర్సులను నూతనంగా విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చినట్టు చెప్పారు. గణితం, రసాయన, భౌతిక శాస్త్రం, కంప్యూటర్ విభాగాల్లో మొత్తం ఎనిమిది కోర్సులు ప్రారంభిస్తున్నామని, లైఫ్ సైన్సెస్‌లో నాలుగు కోర్సులు, హ్యూమానిటీస్‌లో ఎనిమిది కోర్సులు ఉన్నాయని తెలిపారు. కామర్స్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్ వంటి కోర్సులకు కూడా అడ్మిషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి కోర్సుకు వేర్వేరుగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థుల సహాయం కోసం కళాశాల ఆవరణలో అడ్మిషన్స్‌కు ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో వివిధ అనారోగ్య కారణాలతో చికిత్స చేయించుకున్న వారికి సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. శనివారం అనపర్తిలోని ఎన్డీయే కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని 15 మందికి రూ.18.12 లక్షల చెక్కులను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో చికిత్సలు ఎన్టీఆర్ వైద్య ఆరోగ్య పథకం ద్వారా అందిస్తున్నప్పటికీ పథకంలో వర్తించని చికిత్సలకు సీఎం సహాయనిధి ద్వారా సహకారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

టీబీ ముక్త్ భారత్ అభియాన్ సాధనకు కృషి

కడియం, జూలై 19(ఆంధ్రజ్యోతి): టీబీ ముక్త్ భారత్ అభియాన్ సాధన కోసం అందరూ కృషి చేయాలని, టీబీ అనుమానితులు కఫం పరీక్ష చేయించుకోవాలని కడియం, కడియపులంక పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ మణిజ్యోత్స్న, డాక్టర్ జెస్సీ సుప్రియ చెప్పారు. శనివారం ఉదయం వేమగిరి, వీరవరంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుల్లో వారు మాట్లాడారు. అన్ని సచివాలయాల పరిధిలో మధుమేహంతో ఉన్న వారు, 60 ఏళ్లు దాటిన వారు, మద్యపానం, ధూమపానం చేసేవారు, పరిశ్రమల్లో పనిచేసే వారు, వృద్ధాశ్రమంలో ఉండేవారు కఫం పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ శేషు, ఎంఎల్‌హెచ్‌పీలు తులసి, శ్రావణి, రీచ్ ప్రాజెక్టు జిల్లా కోఆర్డినేటర్ వర్మ, సునీత, మల్లిక, అనుప్రసన్న, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు కరవయ్యాయని, కొన్ని హాస్టళ్లు అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను పెంచాలని, ఖాళీగా ఉన్న కమాటీ, వాచ్‌మెన్, కుక్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు పాల్గొన్నారు.

క్వాంటం టెక్నాలజీపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

'నన్నయ' రిజిస్ట్రార్ ఆచార్య స్వామి

దివాన్‌చెరువు, జూలై 19(ఆంధ్రజ్యోతి): క్వాంటం టెక్నాలజీపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి అన్నారు. వర్శిటీలోని ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఏఐసీటీఈ-ఏటీఏఎల్ సౌజన్యంతో క్వాంటం టెక్నాలజీస్, ఆపర్చునిటీస్ అండ్ ట్రెడ్స్ అనే అంశంపై ఆరురోజులుగా జరిగిన ఎఫ్‌డీపీ శనివారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిజిస్ట్రార్ మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో జరిగిన సదస్సులో క్వాంటం వ్యాలీకి సంబంధించి పలు నిర్ణయాలు తీసుకున్నారన్నారు. ఈ తరుణంలో నన్నయలో నిర్వహించిన ఎఫ్‌డీపీ ఫ్యాకల్టీ సభ్యుల విజ్ఞానం, నైపుణ్యాలను మరింత పెంపొందించడానికి ఉపయోగపడిందని అభిప్రాయం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వరరావు, ఎఫ్‌డీపీ కన్వీనర్ వి.పెర్సిస్, కో కన్వీనర్ జి.కీర్తి మరిటా, ఆచార్య పి.సురేష్‌వర్మ, విభాగాధిపతి బి.కెజియారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ప్రోత్సాహక బహుమతులు

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): వందేళ్ల చరిత్ర ఉన్న వైశ్య సేవా సదనం ఆధ్వర్యంలో నడపబడుతున్న గోదావరి గట్టునున్న ఆంధ్ర యువతీ సంస్కృత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమంగా ఉత్తీర్ణులైన విద్యార్థినులకు రిటైర్డ్ జ్యుడిషియల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రోత్సాహక బహుమతులు అందజేసింది. శనివారం పాఠశాల వ్యవస్థాపకుడు నాళం రామలింగయ్య వర్థంతి సందర్భంగా 2024-25 సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమశ్రేణి సాధించిన 9 మందికి నగదు, ప్రశంసాపత్రాలు, పుస్తకాలు బహూకరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్‌కుమార్, కె.శివ ప్రసాదమూర్తి, ఎం.నాగ భాస్కర్, ఎస్ఆర్ పృథ్వి, ఎల్.ఏకొండలరావు, జి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనర్థాలపై కళాజాత

రాజమహేంద్రవరం కల్చరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విభిన్న ప్రతిభావంతుల హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కళాజాత నిర్వహించి మాదకద్రవ్యాల వల్ల కలిగే అనారోగ్యాలు, ఇతర అనర్థాలపై అవగాహన కలిగించారు. వీటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలను వివరించారు. శాఖ సహాయ సంచాలకులు శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్లోకి మహీంద్రా రెవెక్స్



మహీంద్రా రెక్స్ మార్కెట్లోకి విడుదల చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని మహీంద్రా అధీకృత డీలర్ ఎంఅండ్ఎన్ మోటార్స్‌లో శనివారం ఎక్స్ యూవీ 3ఎక్స్‌వో రెవెక్స్ పెట్రోల్ వేరియంట్‌ను జిల్లా రవాణాశాఖ అధికారి ఆర్.సురేష్, ఆ సంస్థ ప్రతినిధులు రాధాకృష్ణ, లక్ష్మీ, శ్రీరాం చేతులమీదుగా మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఎంట్రీ లెవెల్ నుంచే అవసరమైన, ఆధునిక ఫీచర్లతో ధర రూ.8.94 లక్షల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వినియోగదారులు, సంస్థ జీఎం రాజా, సేల్స్ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్లో ప్రత్యేక తనిఖీలు

రాజమహేంద్రవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా ఈ నెల 30వరకూ మానవ అక్రమ రవాణాపై రాజమండ్రి రైల్వే స్టేషన్లో తనిఖీలు నిర్వహిస్తామన్నారు. రైళ్లలో రెస్క్యూ ఆపరేషన్లు చేపడతామని ఎస్ఎంఆర్ రంగనాథ్ పేర్కొన్నారు. ఈ మేరకు చైల్డ్ రైట్స్ అడ్వొకెసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు.

ప్లాస్టిక్ భూతాన్ని
తరిమికొడదాం



రాజమహేంద్రవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

- డీపీవో శాంతామణి
- స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాలు
- పలుచోట్ల అవగాహన ర్యాలీలు

కడియం, జూలై 19(ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి పెనుముప్పుగా తయారైన ప్లాస్టిక్ భూతాన్ని తరిమి కొడదామని జిల్లా పంచాయతీ అధికారి శాంతామణి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ మూడో శనివారం నిర్వహించే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమగిరిలో జరిగిన గ్రామసభలో డీపీవో పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్ నిషేధానికి ప్రభుత్వం జీవో 81 అమలు చేసేందుకు చర్యలు చేపడుతోందన్నారు. ప్లాస్టిక్ విక్రయాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పలు షాపుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ విక్రయాలపై ఆరా తీసారు. గ్రామ సభ అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాస్, కార్యదర్శి రూప్‌చంద్ పాల్గొన్నారు. కడియంలో సహకార శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ప్లాస్టిక్ నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కడియం సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ వెలుగుబంటి రఘురామ్, ముద్రగడ సుధ, తుమ్మెద వరహాలరాజు, సీఈవో ఎస్ అప్పారావు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి.వెంకట్రావు, కూటమి నాయకులు పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరు తమ బాధ్యతగా ప్లాస్టిక్ వాడడం మానివేయాలని కోరారు. అంతకుముందు ప్లాస్టిక్‌ను వాడొద్దంటూ నాయకులు, పంచాయతీ సిబ్బంది గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పండూరి అప్పా రావు, ఆళ్ల ఆనందరావు, సావాడ శ్రీనివాస రెడ్డి, ఒంటెద్దు స్వామి, పల్లా రామస్వామి, దొడ్డి బాబ్జి, ఆళ్ల విఠల్, డాక్టర్ కె.కొండలరావు పాల్గొన్నారు.



ధవళేశ్వరంలో షాపును తనిఖీ చేస్తున్న డీపీవో

బిక్కవోలు: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని తహశీల్దార్ సత్యకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. గ్రామంలో ర్యాలీ జరిపి ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను గ్రామస్థులకు వివరించారు. ర్యాలీలో సర్పంచ్ సరెళ్ల సుమలత, డిప్యూటీ ఎంపీడీవో జాన్‌మిల్టన్, ఏఓ నాగేంద్రప్రసాద్, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి చేకూరి లక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాస్ కలసి మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. పీ-4 గ్రామసభలు, హౌసింగ్ స్టేజ్ కన్వర్షన్, ఉమెన్ చైల్డ్ మ్యారేజెస్‌పై చర్చించారు.

రాజమహేంద్రవరం అర్బన్: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల పరిసర ప్రాంతాల్లో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామచంద్రరావు ప్లాస్టిక్ నిర్మూలన ఆవశ్యకత, ప్రాధాన్యత, అవసరాన్ని విద్యార్థులకు వివరించారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. సాసా కో ఆర్డినేటర్ జి.రవితేజ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీరామమూర్తి, చంద్రశేఖర్, కోమలి, ఈసుబ్ బాషా, జే.సురేష్, సుభాషిణిదేవి, పలువురు హెచ్‌వోడీలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, వైఆర్‌సీ, విద్యార్థులు పాల్గొన్నారు.

దివాన్‌చెరువు: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ప్రాంగణంలోని కళాశాలల ఆవరణలలోని చెత్తను తొలగించి శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం కన్వీనర్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ గృహాలు పరిసర ప్రాంతాల్లోని ప్లాస్టిక్‌ను నివారించి పర్యావరణాన్ని కాపాడాలని వలంటీర్లను కోరారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ పరిశుభ్రతఅధికారి బి.జగన్మోహనరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీవోలు ఎం.గోపాలకృష్ణ, అప్పలరాజు, శిరీష, ఎల్.ముత్యాలనాయుడు, ఎల్.సుజాత, ఎస్.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం

ధవళేశ్వరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ధవళేశ్వరం విచ్చేసిన జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతమణి పంచాయతీ కార్యదర్శి వెంకట్రావులతో కలిసి ప్లాస్టిక్ సామగ్రి అమ్మే హోల్‌సేల్ షాపులను తనిఖీ చేశారు. షాపుల్లో ఉన్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, ప్యాకేజింగ్ బాక్స్‌లు, నిషేధిత ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకుని పంచాయతీ కార్యాలయానికి తరలించారు. నిషేధిత ప్లాస్టిక్ సామగ్రిని అమ్మవద్దని హెచ్చరించారు. ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతిఒక్కరు కృషి చేయాలన్నారు.

సంక్షేమ ఫలాలు అర్హులందరికీ చేరాలి



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల

- చిత్తశుద్ధితో వ్యవహరించాలి
- వివిధ శాఖల అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ చేర్చడంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆకాంక్షించారు. ఈమేరకు శనివారం రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో రాజానగరం నియోజకవర్గ అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరుపై పలు శాఖల అధికారులతో సమీక్షించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పక్కా ప్రణాళికలతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాజానగరం మండలంలోని కలవచర్లలో 104 ఎకరాల విస్తీర్ణంలో రూపుదిద్దుకుంటున్న ఇండస్ట్రియల్ పార్క్ మరో వారం, పది రోజుల్లో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నామన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. డీఆర్‌డీఏ, సెర్ప్ అధికారులు, సిబ్బందితో జరిగిన సమీక్షలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫీల్డ్ స్థాయి సిబ్బంది తమ పనితీరు మార్చు కోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. అలాగే ఎక్సైజ్‌శాఖ అధికారులతో జరిగిన సమీక్షలో మాట్లాడుతూ నియోజకవర్గంలో బెల్టు షాపుల నిర్వహణపై ఉక్కుపాదం మోపాలన్నారు. సారా తయారీ,విరివిగా విక్రయిస్తున్న ప్రాంతాలను గుర్తించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనలో చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.సమావేశాల్లో ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

కోరుకొండ, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటికేశవరం గ్రామానికి చెందిన సుమారు 100 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం జనసేన పార్టీలోకి చేరారు. వారికి ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గాన్ని శరవేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే బత్తుల పనితీరును చూసి తాము జనసేనలో చేరినట్టు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు అడ్డాల శివ, నాతిపాము దొరబాబు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన



రాజమహేంద్రవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, శక్తి యాప్‌పై తుమ్మలోవలోని మునిసిపల్ హైస్కూల్, రాజమహేంద్రి కళాశాల విద్యార్థులకు సైబర్ ల్యాబ్ పోలీసులు శనివారం అవగాహన కల్పించారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాలో అపరిచితులతో చాటింగ్ చేయడం, అనవసర లింకులు, యాప్‌లను ఓపెన్ చేయడం వల్ల ఇబ్బందుల్లో పడతారన్నారు. ఈ-మెయిల్స్‌తో కూడా హ్యాకర్లు మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. సైబర్ నేరానికి గురైనప్పుడు వెంటనే 1930కి ఫోన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. బ్యాడ్ టచ్, గుడ్ టచ్, బాల్య వివాహాల వల్ల అనర్థాల గురించి శక్తి టీం పోలీసులు వివరించారు. కార్యక్రమంలో సైబర్ ల్యాబ్ పోలీసులు వైవీ సురేశ్, పి.దుర్గాప్రసాద్, శక్తి టీం పోలీసులు పాల్గొన్నారు.

మిల్లు కార్మికులకు మంచి అగ్రిమెంట్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): పేపరుమిల్లు కార్మికులకు మంచి అగ్రిమెంట్ చేయాలని లేకుంటే మిల్లు ఈడీ ముఖేష్ జైన్‌కు మూడుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈనెల 21న కార్మికులకు మంచి అగ్రిమెంట్ జరగకపోతే ముఖేశ్‌జైన్ ముడుపుల సంగతి సీఐడీకి అందజేస్తామన్నారు. మిల్లుకు వచ్చే రూ.400 కోట్ల లాభాల్లో రూ.40 కోట్లు సీఎస్ఆర్ నిధులు ఖర్చుచేయాలని కాని అలా కాకుండా కొందరికి ముడుపులు ఇచ్చి వారు నోరు ఎత్తకుండా చేసుకుని కార్మికులకు అన్యాయం చేస్తున్నాడన్నారు. పరంపర ఉద్యోగాలు కూడా సీనియారిటి ప్రకారం ఇవ్వకుండా ఒక్కో ఉద్యోగానికి రూ.12 నుంచి 15లక్షలు వరకు తీసుకుని అమ్ముకున్నారని విమర్శించారు. కొంత మంది మిల్లు కార్మిక నేతల అసమర్థత వల్లనే మంచి అగ్రిమెంట్ జరగలేదని, ఇప్పుడు అగ్రిమెంట్ చేయకపోతే ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు జేటీ రామారావు, బర్రే సుబ్రహ్మణ్యం, దెయ్యాల రాజు, మహ్మద్ ఆలీ, దేశిరెడ్డి బలరామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు, గణితంలో పట్టు సాధించాలి



బిక్కవోలు స్కూల్ కాంప్లెక్స్‌లో మాట్లాడుతున్న ఏఎంవో గౌరిశంకర్

జిల్లా అకడమిక్ మోనిటరింగ్ అధికారి గౌరిశంకర్

బిక్కవోలు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలో విద్యార్థులందరూ తెలుగు, గణితంలో పట్టు సాధించినపుడే ఉన్నత పాఠశాలల్లో రాణిస్తారని జిల్లా అకడమిక్ మోనిటరింగ్ అధికారి గౌరిశంకర్ ఉపాధ్యాయులకు సూచించారు. బిక్కవోలు ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశానికి ఆయన విజిటింగ్ ఆఫీసర్‌గా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగులో చదవడం, రాయడం రావాలని, గణితంలో కూడికలు, తీసివేతలు, గుణకార, భాగహారాలు చేయడం రావాలన్నారు. అలాగే టీచర్స్ హ్యాండ్ బుక్స్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.పాఠశాల పరిధిలోని బడిఈడు పిల్లందరూ బడిల్లో చేర్పించాలని, డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలన్నారు. పాఠశాలల తనిఖీలకు జిల్లా, మండల స్థాయిలో అకడమిక్ ఫారమ్స్‌ను ఏర్పాటు చేయనున్నారని ఏఎంఓ వివరించారు. కాంప్లెక్స్ హెచ్ఎం రమాదేవి, ఇళ్లపల్లి హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, కాంప్లెక్స్ పరిధిలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గింపుతో ఆరోగ్యవంతమైన భవిష్యత్

ఇన్‌చార్జి ఎంపీడీవో సునీల్‌ఆర్మ్‌స్ట్రాంగ్

రాజమహేంద్రవరం రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకం తగ్గించడం ఒక్కటే ఆరోగ్యవంతమైన భవిష్యత్‌కు పెట్టుబడి అని మండల ఇన్‌చార్జి ఎంపీడీవో సునీల్‌ఆర్మ్‌స్ట్రాంగ్ అన్నారు. ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత అని ప్రతిఒక్కరూ క్లాత్ కవర్లను మాత్రమే వినియోగించాలని పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ప్లాస్టిక్ వాడడం వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరిస్తూ స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొర్రేడు గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు క్లాత్ కవర్లు పంచారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు ప్లాస్టిక్ కవర్లు వాడడం వల్ల కలిగే నష్టాలను వివరించారు. పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోని ఎస్‌బీజీ మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లు విక్రయించే దుకాణాలు, పలు షాపులను అధికారులు తనిఖీ చేసి వారిపై అపరాధ రుసుము వసూలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ టి.కృష్ణ, పంచాయతీ కార్యదర్శులు డి.సూర్యనారాయణ, శకుంతల, కాశీవిశ్వనాథ్, రాధాకృష్ణ, డి.శ్రీనివాసరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

తూర్పుగోనగూడెం బస్ షెల్టర్‌లో వ్యక్తి మృతదేహం

రాజానగరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోనగూడెంలోని జాతీయ రహదారిని ఆనుకుని గళ్లా రంగారావు బస్ షెల్టర్‌లో పడి ఉన్న ఒక వ్యక్తి మృతదేహాన్ని శనివారం స్థానికులు గుర్తించారు. వారి సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడి ప్యాంట్ జేబులో లభించిన ఆధార్‌కార్డు ప్రకారం ఒడిస్సా రాష్ట్రానికి చెందిన రొక్కం గిరిధర్(40) తండ్రి రఘుపతి, మెయిన్ రోడ్, కాశీనగర్, గజపతి, ఒడిస్సా-761206గా గుర్తించామన్నారు. మృతదేహం కుళ్లిపోయి దుర్గంధం వస్తూ గుర్తించేందుకు వీల్లేకుండా ఉంది. స్థానిక వీఆర్వో ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నాగార్జున తెలిపారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించామన్నారు.

పారిశుధ్య కార్మికులు విధుల బహిష్కరణ

రాజమహేంద్రవరం రూరల్, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బొమ్మూరు పంచాయతీ పారిశుధ్య కార్మికులకు 3 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో శనివారం విధులను బహిష్కరించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి కాశీవిశ్వనాథ్‌ను వివరణ కోరగా ఏప్రిల్ నెల జీతాలకు సంబంధించి గత నెల 15న బిల్లు పెట్టామని అయితే సాంకేతిక కారణాలతో సమస్య ఏర్పడిందని, తరువాత ప్రత్యేకాధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ బదిలీ కావడం తదితర సమస్యలతో జీతాల చెల్లింపులో జాప్యం ఏర్పడిందని త్వరలోనే సిబ్బందికి జీతాలు చెల్లిస్తామన్నారు. ఈ విషయమై కార్మికులతో కూడా చర్చించినట్టు తెలిపారు.

అష్టదేవీల దర్శనానికి ఆర్టీసీ బస్సులు

రావులపాలెం డిపో మేనేజర్ వైవీ కుమార్

కడియం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం అష్టదేవీల దర్శనం పేరిట ఆర్టీసీ బస్సు లు ఏర్పాటు చేయడం లాభదాయకంగా ఉంద ని, అలానే కడియపులంక పుంతలో ముసలమ్మ దర్శనం కీలకంగా మారిందని రావులపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ వైవీ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ అచ్యుతాంబ తెలిపారు. ఆఖరి శుక్రవారం కావడంతో పది బస్సుల్లో భక్తులు, వారితో పాటు ఆర్టీ సీ అధికారులు ము సలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.ఇక్కడ ఆలయ నిర్వాహకులు రాత్రి 10గంటల సమయం దాటిన తరువాత కూడా అమ్మవారి దర్శనంతో పాటు అల్పాహారాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఆధ్యాత్మిక కేంద్రాలకు బస్సులను ఏర్పాటు చేయడంలో రావులపాలెం డిపో ముందంజలో ఉందని అన్నారు.

బీసీ కళాశాల బాలికల హాస్టల్‌కు
సీలింగ్ ఫ్యాన్లు వితరణ

రాజమహేంద్రవరం అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం తుమ్మలావలోని బీసీ కళాశాల బాలికల హాస్టల్‌కు బ్యాంకు ఉద్యోగులు సీలింగ్ ఫ్యాన్లను వితరణ చేశారు. బ్యాంకుల జాతీయకరణ 56వ వార్షికోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.లక్ష్మీపతి మాట్లాడుతూ బ్యాంకుల జాతీయకరణ నిర్ణయం భారతదేశ ఆర్థిక వ్యవస్థ పురోగతిలో ముఖ్యఘట్టంగా నిలిచిందని గుర్తుచేశారు. యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారి ముత్యాల సుబ్బారావు, మహిళా సమాఖ్య నాయకురాలు స్వాతి, నాయకులు సూర్య, కిషోర్, ప్రకాష్, హాస్టల్ వార్డెన్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: జూనియర్
సూర్యమినీ	: ఓ భామ అయ్యో రామ
సూర్యప్యాలస్	: కొత్తపల్లిలో ఒకప్పుడు
స్వామి	: కుబేర
శివజ్యోతి	: వర్జిన్ బాయ్స్, తమ్ముడు
అనుశ్రీ(సాయికృష్ణ)	: మై బేబీ
రాజా	: ఏ మాయ చేసావే
ఊర్వశి	: 3బీహెచ్‌కే
రంభ	: ఎఫ్-1 ది మూవీ, మార్గన్
మేనక	: సూర్య S/O కృష్ణన్
అప్సర	: ఏ మాయ చేసావే
కుమారి	: ----
అశోక	: జూనియర్
పీఎస్ మహల్(నామవరం)	: జూనియర్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: జూనియర్
వెంకటసూర్య(కడియం)	: -------
సత్యగౌరి (అనపర్తి)	: మార్గన్
సూర్యశ్రీ (అనపర్తి)	: జూనియర్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: జూనియర్
రామకృష్ణ(కోరుకొండ)	: జూనియర్
గీతాసినిమాస్ (సీతానగరం)	: జూనియర్
శ్రీనివాస (గోకవరం)	: జూనియర్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఓ భామ అయ్యో రామ
లలితామహల్(రంపచోడవరం)	: జూనియర్
నవయుగ(చింతూరు)	: జూనియర్



యానాంలో ఇటీవల రూ.18 వేలకు విక్రయించిన పులస

ఆదివారం ప్రత్యేకం

యాండే.. పులసండే..



- గోదారి ఎర్రనీట్లో సందడి చేస్తోన్న పులస చేప
- గతంతో పోల్చితే ఇవి అరుదుగా దొరుకుతుండడంతో భారీ ధర
- ఇటీవల రూ.18 వేలు పలికిన కేజీన్నర చేప.. గతేడాది ఏకంగా రూ.25 వేలు
- సీజన్ ప్రారంభమవడంతో ఈ దఫా అయినా భారీగా దొరికేనా అని మత్స్యకారుల్లో ఆశ

పులస... పులసోయ్ పులస... నోరూరించే పులస.. పుస్తెలమ్మయినా కొనుక్కుని తినాల్సిన పులస.. సాధారణంగా ఏ స్వీట్లు గురించో వింటే ఠక్కున నోరూరుతుంది.. చేపల్లో పులస గురించి వింటే జిహ్వాచాపల్యం ఆగదు.. ఎలాగైనా.. ఎంత పెట్టి కొని అయినా తినాలనిపించే ఈ చేప గురించి ఎంత చెప్పినా తక్కువే.. వర్షాకాలం వస్తే గోదావరికి ఎర్రనీరు ఎలా పోటెత్తుతుందో... పులస కూడా అలా సముద్రం నుంచి గోదావరికి ఎదురీది పులస ప్రియుల నోట్లోకి జారుతుంది.. సాధారణంగా చికెన్..మటన్.. చేప తింటే బయటకొచ్చి దీని గురించి ఎవరూ పెద్ద గొప్పగా చెప్పుకోరు.. కానీ పులస తిన్నవాళ్లు మాత్రం రోజుల తరబడి ఊరంతా చెప్పుకోవడం ఓ ప్రెస్టేజీ కూడా.. గోదారోళ్లకు మహా ఇష్టమైన...ఖరీదైన.. చుట్టాలు, స్నేహితులకు గొప్ప గిఫ్ట్‌లా పేరొందిన పులస సీజన్ ఇప్పుడు గోదావరిలో మొదలైంది. భారీ వర్షాలతో వరద పోటెత్తుతుండడంతో ఒక్కో పులస అలా అలా ఈదుకుంటూ పులసప్రియుల నోటికి చిక్కడానికి ఇప్పుడిప్పుడే కదులుతోంది... పదండి... ఇంకా దీని గురించి చెప్పుకుందాం...

(కాకినాడ/యానాం-ఆంధ్రజ్యోతి)

వానాకాలం వస్తే అందరి నోట్లో నానే పదం పులస. ఇప్పుడు వానాకాలం కావడంతో గోదావరి ఎర్రనీరు సముద్రంలో కలుస్తుండడంతో పులసల సీజన్ మొదలైపోయింది. ఇప్పటికే యానాం గౌతమి గోదావరిలో అక్కడక్కడా పులసలు దొరుకుతున్నాయి. ఇటీవల యానాం మార్కెట్‌లోకి పలువురు వ్యాపారులు పులసలను తెచ్చి విక్రయించారు. వేలు ఖర్చుపెట్టి మరీ ఈ చేపలు కొనేందుకు ఎగబడ్డారు. వాస్తవానికి పుస్తెలమ్మయినా పులస తినాలి అనేది గోదావరి జిల్లాల్లో పులస చేప కోసం వినబడే నానుడి. ఎందుకంటే దీని ధర ఎంతకు ఎగబాకుతుందో ఎవరికీ తెలియదు. చేపలను మార్కెట్లో ఇలా వెళ్లి అలా తెచ్చుకోవచ్చు.. కానీ పులసను మాత్రం వేలంలోకి వెళ్లి తెచ్చుకోవాలి. ఎందుకంటే దీనికి ఉన్న గిరాకీ అంత మరి. ధనవంతుల నుంచి సెలబ్రిటీల వరకు... మధ్యతరగతి నుంచి సామాన్యుల వరకు పులస వచ్చిందా.. పులస దొరుకుద్దా.. అంటూ ఈ సీజన్‌లో ఆరా తీయడం మామూలుగా ఉండదు. చాలామంది తమ పనుల కోసం ప్రముఖులను ప్రసన్నం చేసుకునేందుకు, కావాల్సిన పనులను చేయించుకునేందుకు ఈ పులస పులను పంపడం ఓ ఆనవాయితీగా మారింది. అంతేకాదండోయ్.. ఈ సీజన్‌లో విదేశాల్లో ఉన్న గోదావరివాసులు తమ వారితో సరదాగా పులస దొరికిందా.. పులస తిన్నారా అని అడగకుండా ఉండరంటే అతిశయోక్తికాదు.

పులసే తినాలా...

అవును.. పులసే తినాలి... ఇది తింటే ఆ రుచే వేరు.. వాస్తవానికి ఇవి వెండి రంగులో ఉంటాయి. ఆరోహక వలస జాతికి చెందిన పులసలు సాధారణంగా సముద్రంలో జీవిస్తాయి. అయితే సంతాన ఉత్పత్తి కోసం ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, టాంజానియా వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చి హిందూ మహాసముద్రంలో ప్రవేశించి అక్కడ నుంచి బంగాళాఖాతం గుండా వరదల సమయంలో గోదావరిలోకి వచ్చి చేరతాయి. గోదావరి వరదనీరు వచ్చి సముద్రంలో కలిసే సమయంలో గుడ్లు పెట్టిన తర్వాత అక్టోబర్ నాటికి తిరిగి సాగరానికి చేరుకుంటాయి. అలా వెళ్లే క్రమంలో జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వరదలు వచ్చినప్పుడు కొన్ని చేపలు సముద్రం నుంచి గోదారిలో ఎదురీదుకుంటూ వెళ్తూ జాలర్లకు చిక్కుతాయి. పూర్వం సముద్రంలోంచి ఈదుకుంటూ ధవళేశ్వరం బ్యారేజీ వరకు వెళ్లేవి. బ్యారేజీ దిగువన పులసల్లంక అనే లంక కూడా ఉంది. అరుదైన ఈ పులస చేపలు గోదావరిలో తప్ప ఇంకెక్కడా దొరకవు. అందుకే అంత గిరాకీ. వాస్తవానికి పులస సముద్రంలో ఉంటే విలస చేప.. నదిలో దొరికితే పులస అవుతుంది. గత పది రోజుల నుంచి గౌతమి గోదావరిలోకి ఎర్రనీరు రావడంతో పులసలు వచ్చి పడుతున్నాయి. వాస్తవానికి ఈ పులస యానాం వద్ద సముద్రం నుంచి ఎగువకు గోదావరిలో ఎగబాకుతూ ధవళేశ్వరం వరకు ఎదురెళ్తాయి. ఈ క్రమంలో ఎక్కడ మత్స్యకారులకు చిక్కుతుందో తెలియదు. చిక్కిందంటే పంట పండినట్టే.

ఎన్ని ప్రత్యేకతలో..

నదీ ప్రవాహానికి అతివేగంగా ఎదురీదడం ఈ చేప ప్రత్యేకత. పులస చనిపోయినా రెండు రోజుల వరకు కూడా పాడవకుండా ఉండటం మరో విశేషం. అయితే ఈ పులస చేప ధర వేలం పాటలో పాల్గొన్న వ్యక్తుల ఆధారంగా రేటు పెరుగుతుంది. సముద్రానికి దగ్గరగా ఉండే యానాం, కోనసీమ ప్రాంతాల్లో కిలో చేప రూ.25 వేలకు కూడా వెళ్తుంది. ప్రధానంగా అల్లవరం మండలం రెబ్బనపల్లికి చెందిన చేపల వ్యాపారి సాయి ఏటా పులస చేపల వ్యాపారం చేస్తారు. ఇతడికి అనేకమంది నేతలు, ప్రముఖులు ముందే అడ్వాన్సులు ఇచ్చేసి చేప చేజిక్కించుకుంటారు. గతేడాది జూలైలో కోనసీమ జిల్లా వశిష్ఠ గోదావరిలో మలికిపురం మండలం రామరాజులంక గంగపుత్రులకు వలలో కేజీన్నర చేపపడగా రూ.25వేల ధర పలికింది. తాజాగా జూలై 12న యానాం వద్ద కేజీన్నర చేప రూ.18 వేలు పలికింది. గోదావరిలో తీపి నీరు, సముద్రంలో ఉప్పునీరు కలవడంతో ఈ చేప శరీరతత్వం మారుతుంది. అందుకే అంత రుచి. సముద్రం నుంచి గోదావరిలోకి ఎదురీదుకుంటూ వెళ్లడం వలనే పులసలకు అంత టేస్ట్. ఈ పులస చేపల్లో ఆడ, మగ చేపలుండగా, వీటిలో ఆడ చేపకు ధర ఎక్కువ. ఇక పులసను రకరకాలుగా వండి జిహ్వాచాపల్యం తీర్చుకుంటారు. కొందరు వంకాయ, బెండకాయ కలిపి వండుతారు.

అంతకంతకూ మాయం..

కొన్నేళ్లుగా గోదావరిలో పులస లభ్యత తగ్గిపోయింది. సముద్ర జలాలు కాలుష్యం కావడం, చమురు సంస్థల డ్రెడ్జింగ్ వల్ల అనేక చేపలు మరణిస్తున్నాయి. అటు సముద్రం, గోదావరి కలిసే మొగ ప్రాంతంలో ఇసుక మేటలు పేరుకుపోవడంతో పులస గోదావరిలోకి రావడం తగ్గిపోతోంది. అలాగే మత్స్యకారులు భారీ వలలతో వేటాడే సమయంలో తల్లి పులసలు చిక్కడంతో సంతానం తగ్గిపోతోంది. అందుకే వలకు గుడ్డుతో ఉన్న తల్లి చేప కనిపిస్తే నదిలో వదిలేయాలని మత్స్యకారులు ఎప్పటినుంచో ప్రచారం చేస్తోంది. వాస్తవానికి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో 2010కి ముందు సగటున సీజన్‌లో మూడు టన్నుల పులస చిక్కేది. కానీ ఇప్పుడు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెండు క్వింటాళ్లకు పడిపోయింది. వాస్తవానికి కోనసీమ జిల్లాలో యానాం వద్ద, రాజోలు మార్కెట్ పులసలకు పెట్టింది పేరు. కానీ ఎప్పుడోగానీ పులస జాడ ఉండడం లేదు. ఈ ఏడాది ఆరంభంలోనే పులస దొరకడంతో ఈ దఫా చేప లభ్యత పెరిగే అవకాశం ఉందని మత్స్యకారులు ఆశిస్తున్నారు.

విలసలకూ యమా డిమాండు

పిఠాపురం/మండపేట, జూలై19: కొంచెం అదే రుచి, అదే మాధుర్యం, పట్టిపట్టి చూస్తేనే కాని తెలుసుకోలేని వైరుధ్యం. అదే ఒడిశా పులస. గోదావరి పులసలను వేలల్లో పెట్టి కొనలేని వారు వీటిని కొని వండుకుంటారు. ఇప్పుడిప్పుడే విలసల విక్రయాలు మొదలయ్యాయి. ఒడిశా ప్రాంతంలో సముద్ర తీరప్రాంతాల్లో చెరువులు తవ్వి పెంచే పులస జాతి చేపలను ఒడిశా పులసలుగా, ఇలసలుగా పిలుస్తారు. కొందరు సముద్రంలో దొరికే విలసలనూ విక్రయిస్తారు. గోదావరి పులస రూ.5 వేల నుంచి పాతిక వేలు ఉంటే, ఒడిశా పులస మాత్రం సైజును బట్టి రూ.500 నుంచి రూ.1500 వరకూ మాత్రమే ఉంటుంది. కొందరు వీటినే పులసలుగా చెప్పి విక్రయించి మోసగిస్తారు. హోటళ్ల వారూ వీటినే పులసలుగా వండి వడ్డిస్తారు.



విలసల విక్రయం

నేడు ఏపీపీఎస్సీ రాత పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

45 నిమిషాల ముందే రావాలి: జేసీ

రాజమహేంద్రవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో లెక్చరర్ పోస్టుల భర్తీకి ఆదివారం నిర్వహిస్తున్న పరీక్షకు అన్ని శాఖల సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేశామని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు పేర్కొన్నారు. ఈ పరీక్షలు రెండు షిఫ్టుల్లో జరుగుతాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకూ జరిగే పరీక్షకు 519, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ నిర్వహించే పరీక్షకు 240 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని తెలిపారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్‌తో పాటు తగిన గుర్తింపు కార్డుతో పరీక్ష ప్రారంభ సమయానికంటే 45 నిమిషాల ముందే పరీక్షా కేంద్రం వద్ద హాజరు కావాలని ఆయన సూచించారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లకు అనుమతి ఉండదన్నారు. అభ్యర్థుల కోసం ఆయా రూట్లలో బస్సులను నడపాలని, రిక్వెస్టు స్టాపులను ఏర్పాటుచేయాలని ఆర్టీసీ అధికారులను జేసీ ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో సీతారామమూర్తి, ఆర్డీవో కృష్ణనాయక్, ఏపీపీఎస్సీఅధికారి ఎం.జగదీశ్ పాల్గొన్నారు.



కలెక్టర్ పి.ప్రశాంతి

అన్నదానాలకు అనుమతి తప్పనిసరి

స్వచ్ఛ రాజమహేంద్రవరం కోసమే ఈ నిర్ణయం

కలెక్టర్ పి. ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఎవరైనా దాతలు, ఎన్జీవోలు, స్వచ్ఛంద సేవా సంస్థలు అన్నదానాలు నిర్వహించాలంటే ఇకపై నగరపాలక సంస్థ అనుమతులు తప్పనిసరి అని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్వచ్ఛ రాజమహేంద్రవరం నిర్మాణంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. నగరంలో అన్నదానాలు చేయాలనుకునేవారు 48 గంటల ముందు తమతమ వార్డు సచివాలయాల్లో అనుమతులు తీసుకోవాలని సూచించారు. దీనివల్ల ప్లాస్టిక్ ప్లేట్లు, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదంతోపాటు ఆయా ప్రాంతాల్లో ముందుగానే డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తద్వారా తిన్న ప్లేట్లు రోడ్ల పక్కన, సైడ్‌కాల్వలో పడవేయకుండా డస్ట్‌బిన్‌లలో పడవేయడం ద్వారా ఆ ప్రాంతంలో పారిశుధ్యాన్ని కాపాడిన వారవుతామన్నారు. ముఖ్యంగా పండగలవేళ ఇతర ముఖ్య సంప్రదాయక రోజుల్లో రోడ్ల మీద అన్నదానాలు ప్రసాదాలు, మజ్జిగ, మంచినీరు వంటివి ప్లాస్టిక్ గ్లాసుల ద్వారా పంచడం, తద్వారా ప్రజలు వాటిని రోడ్ల మీద పారవేయడం జరుగుతుందన్నారు. అలాగే గోదావరి గట్టు వెంబడి ప్లాట్‌ఫారంపై నివశిస్తున్న అనాథలు, అభాగ్యులకు కొందరు దాతలు ప్రతీరోజు టిఫిన్లు, భోజనం సరఫరా చేస్తుంటారని, కానీ వ్యర్థాలను అక్కడే పారవేయడంతో ఈ ప్రాంతం అపరిశుభ్రంగా మారుతోందన్నారు. అందువల్ల దాతలు, స్వచ్ఛంధ సంస్థలు ఎవరైనా వితరణ చేసేముందు తమ వార్డు సచివాలయంలో పేరు, సంస్థ వివరాలు కచ్చితంగా నమోదు చేసుకోవాలని సూచించారు. నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖధికారి అనుమతి ఇచ్చిన అనంతరం సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ సాయంతో ట్రాఫిక్‌కు అంతరాయం లేని ప్రదేశంలో అన్నవితరణ నిర్వహించుకోవాలన్నారు. అన్నదాన అనంతరం శానిటేషన్ సెక్రటరీకి సమాచారం అందిస్తే వ్యర్థాలను వాహనం ద్వారా సేకరించడం జరుగుతుందన్నారు. క్లీన్ రాజమహేంద్రవరంలో భాగస్వాములు కావాలని కోరారు.




జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ప్లాస్టిక్ కాలుష్యం నిర్మూలనకు ప్రజలు కలిసిరావాలి

స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ ప్లాస్టిక్ నిర్మూలన ర్యాలీలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ, జూలై19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కాలుష్యాన్ని నిర్మూలించడానికి ప్రజలంతా కలిసి రావాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరంలో మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన ర్యాలీకి స్థానిక వై జంక్షన్ వద్ద కలెక్టర్ ప్రశాంతి జెండా ఊపారు. ఈ ర్యాలీ కంబాలచెరువు, దేవీచౌక్, గోకవరం బస్టాండ్ మీదుగా సుబ్రహ్మణ్యం మైదానం వరకు సాగింది. ఈ సందర్భంగా తొలుత కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ప్రతి నెల ఒక్కో థీమ్‌తో కార్యక్రమం చేపడుతున్నామన్నారు. జూలై నెలలో 'ప్లాస్టిక్ వాడకాన్ని ఆపేద్దాం' అనే ఇతివృత్తంతో కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. పర్యావరణానికి సంబంధించి జరిగే అనర్థాలపై అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టినా ప్లాస్టిక్ వినియోగాన్ని ఆశించిన మేరకు తగ్గించలేకపోతున్నామన్నారు. ఇకనైనా దీనిపై ప్రతి ఒక్కరు దృష్టిసారించాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఇటువంటి కార్యక్రమాలు విజయవంతమవుతాయన్నారు. బయటికి వెళ్లేటప్పుడు ప్లాస్టిక్ కవర్లు బదులు జ్యూట్ బ్యాగులను, కాటన్ బ్యాగులను వెంట తీసుకువెళ్లాలని ప్రజలకు సూచించారు. ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నవారిపై రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధిస్తోందని చెప్పారు. ప్లాస్టిక్ ప్రత్యామ్నాయంగా రూపొందించిన వస్తువులను మెప్మాద్వారా అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. ఇటీవల రాజమహేంద్రవరం నగర పాలక సంస్థకు స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డు లభించిందని, ఈ అవార్డు మన బాధ్యతను మరింత పెంచిందని చెప్పారు. నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టిక్ కవర్లు వినియోగించకుండా వెనక్కి తిరిగి ఇస్తే వారికి నగర పాలక సంస్థ ప్రోత్సాహక బహుమతిని అందజేస్తుందని చెప్పారు. ఇందుకోసం నగరంలో జాంపేట జంక్షన్, వీఎల్ పురం జంక్షన్, దానవాయిపేటలో ప్రత్యేక ఔట్‌లెట్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. తొలుత నిర్వహించిన ర్యాలీలో వివిధ శాఖల సిబ్బంది 'ప్లాస్టిక్ వద్దు- కాటనే ముద్దు', 'ప్లాస్టిక్ భూతం- పర్యావరణానికి హాని' అంటూ నినాదాలు చేశారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దామని వేసిన వేషధారణలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



సందర్శించారా!

- సైన్స్ మ్యూజియం సందర్శనకు ధరలు నిర్ణయం
- ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులు ఒక్కొక్కరికి రూ.25
- ప్రైవేట్ విద్యార్థులకు రూ.40, పెద్దలకు రూ.50
- ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకూ అనుమతి
- ఇంకా దారిన పడని మ్యూజియం
- ఉద్యోగులూ అరకొరే

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

సైన్సు మ్యూజియానికి సందర్శకుల సందడి మొదలైంది. ఈ మ్యూజియం చూసేందుకు ధరలు నిర్ణయించారు. ఈ మ్యూజియం ప్రతీ రోజూ ఉదయం 9 గంటలకు తెరుస్తారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ సందర్శకులకు అనుమతి ఉంటుంది. ప్రభుత్వ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.25, ప్రైవేట్ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.40, పెద్దలకు రూ.50 వంతున టికెట్ ధరలు నిర్ణయించారు. కానీ సరైన ప్రచారం, ప్లాన్ లేకపోవడం వల్ల ఇంకా పెద్దగా విద్యార్థులు రావడంలేదు. ఆది, శనివారాల్లో ఏదో కొద్ది మంది వస్తున్నారు. ఇక్కడ ఉద్యోగులు పూర్తి స్థాయిలో విధుల్లో చేరలేదు. కొందరు చేరి సెలవుల్లో ఉన్నారు. ఇక్కడ ఒక్క ఇన్‌చార్జి మాత్రమే ఉన్నారు. సెక్యూర్టీ, ఇతర స్వీపర్లు మాత్రం ఉన్నారు. ఈ మ్యూజియం విశేషాలను ఆయా ఆయా విద్యాసంస్థలలో ప్రచారం చేసినా, పర్యాటకులకు అవగాహన కల్పించినా బాగా సందర్శకులు వచ్చే అవకాశం ఉంది. కానీ అటువంటి ప్రయత్నాలు ఏమీ ఇక్కడ చేయకపోవడం గమనార్హం. వచ్చిన వారికి కూడా పూర్తిగా ఇక్కడి విశేషాలు వివరించేవారు కూడా లేకపోవడం గమనార్హం. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల విద్యార్థులకు ఉపయోగపడేలా రాజమహేంద్రవరంలోని బొమ్మూరులో విజ్ఞాన కేంద్రం (సైన్స్ మ్యూజియం)ను నిర్మించిన సంగతి తెలిసిందే. గత నెల 26న కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రషెకావత్, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తదితరుల సమక్షంలో ఇది ప్రారంభమైన సంగతి తెలిసిందే. వాస్తవానికి గత పుష్కరాల సమయంలో కేంద్రం నుంచి తెచ్చిన హామీనే ఇది. గతంలోనే స్థల సేకరణ జరిగినా, టెండర్లు పిలిచినా, గత ప్రభుత్వ వైఖరి వల్ల ఆలస్యం అయింది. తర్వాత ఈ విజ్ఞాన కేంద్రాన్ని నిర్మించారు. 5 ఎకరాల స్థలంలో దీనిని నిర్మించారు. సుమారు రూ. 10 కోట్లతో నిర్మించారు. ఈ సైన్సు కేంద్రం ఓ అద్భుతం. సైన్స్ పరికరాలు, విజ్ఞాన సమాచారం, ప్రయోగశాలలు ఏర్పాటుచేశారు. ఈ భవనాన్ని జీప్లస్ 1గా నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో మూడు రూమ్‌లు ఉన్నాయి. ఫస్ట్ ఫ్లోర్‌లో 6 గ్యాలరీలు ఉన్నాయి. ఆడిటోరియం, కాన్ఫరెన్స్ హాల్ ఉంది. సాంకేతికపరమైన 18 ఎగ్జిబిషన్లు ఉన్నాయి. ఓపెన్ గ్రౌండ్‌లో సైన్సు పార్కు ఉంది. రన్నియాన్స్ గ్యాలరీలో ఫిజిక్స్, మాథ్స్‌కి సంబంధించిన 33 విజ్ఞాన అంశాలు ఉన్నాయి. అటవీ, పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ కోసం మరో నిర్మాణం కూడా చేయనున్నారు. వాటర్ వర్రీస్ గ్యాలరీలో వర్చువల్ మ్యూజియం, మరో 35 ఎగ్జిబిషన్లు ఉన్నాయి. సౌండ్ చిత్రాలు సేకరణ, ఖగోళ వస్తువులు, సాంకేతిక, శాస్త్రీయ, పారిశ్రామిక పురోగతికి సంబంధించిన 32 ప్యానెళ్లు ఉన్నాయి. ఎ జర్నీ విత్ లైట్ పై స్పేస్, గెలాక్సీ గ్రహాలతో కూడిన 20 ప్యానెల్స్ ఉన్నాయి.



స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయిస్తున్న మంత్రి దుర్గేష్, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు

ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం : మంత్రి దుర్గేష్

పెరవలి, జూలై19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకం ఆరోగ్యానికి, పర్యావరణానికి హానికరమని, కాబట్టి ప్రతీ ఒక్కరూ దీని వినియోగాన్ని తగ్గించాలని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శనివారం పెరవలి మండలం కానూరులో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలంటూ ప్రజలతో కలిసి మానవహారం నిర్వహించారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సర్పంచ్ భావన మధు, డివిజనల్ పంచాయతీ అధికారి వై.అమ్మాజీ, ఎంపీడీవో కె.ఉమారాజ్యలక్ష్మి పద్మజ, తహశీల్దార్ కె. నిరంజన్, సీడీపీవో ఎం.ఆశా రోహిణి, పిప్పర రవి, వాకలపూడి వీర్రాజు, ముళ్ళపూడి రాజేంద్రప్రసాద్, కోలా సీతయ్య పాల్గొన్నారు. కాగా ఇటీవల మరణించిన కానూరు అగ్రహారానికి చెందిన జనసేన కార్యకర్త మెల్లరాజు కుటుంబానికి రూ.లక్ష విరాళం అందజేశారు.

రైతులకు ఎరువుల పంపిణీ పారదర్శకంగా జరగాలి : కలెక్టర్ ప్రశాంతి

రాజానగరం,జూలై19(ఆంధ్రజ్యోతి): రైతులకు ఎరువుల పంపిణీ వ్యవస్థలో పారదర్శకత ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి స్పష్టంచేశారు. రాజానగరం మండలంలోని తోకాడ, భూపాలపట్నం సహకార సంఘాల కేంద్రాల్లో శనివారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు కేటాయించిన ఎరువుల సరఫరా విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా 50 శాతం ప్రభుత్వరంగం, మరో 50 శాతం ప్రైవేటు రంగం ద్వారా పంపిణీ జరగాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతి యూరియా బస్తాపై రూ.1,542 సబ్సిడీ ఇస్తుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఎరువులను దుర్వినియోగం చేయకుండా మండల స్థాయిలో రెవెన్యూ, వ్యవసాయ, హార్టికల్చర్, సహకార శాఖల అధికారులతో కూడిన ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి, నిత్యం పంపిణీపై పర్యవేక్షణ ఉండాలన్నారు. ఇతర జిల్లాలకు ఎరువులు తరలించకుండా, జిల్లాలో ఎరువుల వాస్తవ అవసరాలకు మేరకు సరఫరా నిర్ధారించాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమంగా ఎరువుల కొరత సృష్టిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గ్రామ/మండల స్థాయిలో ఎరువుల వినియోగంపై నమోదైన రికార్డులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని అధికారులకు ఆదేశించారు. ఇప్పటికే నాట్లు వేసిన పంటలకు అవసరమైన ఎరువుల సరఫరా పూర్తిగా జరిగిందా లేదా అనే అంశాన్ని కూడా సమీక్షించాలన్నారు. ఒక ఎకరానికి ఎన్ని బస్తాలు యూరియా అవసరమవుతుందో రైతులను వ్యక్తిగతంగా అడిగి తెలుసుకున్నారు. అవసరానికి మించి ఎరువుల వినియోగం వ్యవసాయేతర అవసరాలకు వాడుతున్నట్టుగా తెలిసిందని, ఎరువులను దుర్వినియోగం చేసినట్టు తెలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో జిల్లా సహకార అధికారి ఎం.వెంకటరమణ, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ డి.ప్రతాప్, రైతులు, ఆయా శాఖలకు చెందిన అధికారులు కలెక్టర్ ప్రశాంతి వెంట ఉన్నారు.



ఎరువుల వినియోగంపై రైతును అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

నాణ్యమైన పొగాకుతో గిట్టుబాటు ధర 8

- ఐటీసీ వైస్ ప్రెసిడెంట్ రవీశ్

ఆపదలో ఉన్నవారికి పెద్దకొడుకునవుతా

• గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

నల్లజర్ల, జూలై 19 (ఆంధ్ర జ్యోతి): తనకు ఓట్లు వేసి గెలిపించి అసెంబ్లీకి పంపించిన నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, అలాగే ఏ ఆపద వచ్చినా పెద్ద కొడుకుగా ఉండి ఆదుకుంటానని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. వెస్ట్‌చోడవరం గ్రామానికి చెందిన తానింకి నాగేంద్ర ఇటీవల కరెంటుషాక్ తగిలి మృతిచెందాడు. ఆ కుటుంబానికి విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడి రూ. ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియాను మంజూరు చేయించారు. ఆ చెక్కును మృతుడి సతీమణికి శనివారం అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తాటిన సత్యనారాయణ, జమ్ముల సతీష్, టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్

కొవ్వూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ అందజేస్తున్నట్టు జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి వి. పార్వతి తెలిపారు. శనివారం కొవ్వూరు పట్టణంలోని క్రిస్టియన్ పేట, మండలంలోని పంగిడిలో సివిల్ సప్లయిస్ అధికారులు పర్యటించారు. 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటివద్దకే రేషన్ అందుతుందా, లేదా అన్న విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ ఎం.సునీత, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అతడి బంధువులపై కేసు

కొవ్వూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం తేవాలని వేధిస్తున్న భర్త, అతడి బంధువులపై కేసు నమోదు చేసినట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరుకి చెందిన కల్లకుంట్ల సుశీలరాణికి కర్ణాటకలోని షిమోగా జిల్లా భగవతి హడ్కో కాలనీకి చెందిన ఆనంద్‌తో 2024 అక్టోబర్ 25న వివాహం జరిగింది. ఆ సమయంలో రూ. మూడు లక్షల కట్నం, 30 గ్రాముల బంగారం, పెళ్లి ఖర్చులకు రూ. 1.5 లక్షలు ఇచ్చారు. అయితే కొంతకాలం తరువాత భర్త ఆనంద్, తల్లి కౌసల్య, బంధువులు శాంతమ్మ, అర్పిత, ఆల్విన్ అదనంగా మరో రూ. మూడు లక్షల కట్నం తీసుకురావాలని శారీరకంగా, మానసికంగా సుశీలరాణిని వేధింపులకు గురి చేస్తున్నారు. దీనిపై ఆమె అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

స్వచ్ఛాంధ్రప్రదేశ్‌కు సహకరించాలి : ఎమ్మెల్యే



పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే ముప్పిడి, మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి, తదితరులు

కొవ్వూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధనకు ప్రజలు, అధికారులు సహకారం అందించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు పట్టణంలో మూడో శనివారాన్ని పురస్కరించుకుని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాలు శుభ్రం చేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ పాల్గొన్నారు. వారిద్దరు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, కౌన్సిలర్ రాము, గాంధీ, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ గ్రంధి సందీప్, ఎంఈవో రామకిషోర్, కొప్పాక జవహర్,బర్ల శ్రీనివాస్, బొబ్బిలి పేర్రాజు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని 18వ వార్డు, మండలంలోని చిడిపిలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, దాయన రామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, కౌన్సిలర్ రాము, గాంధీ, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ గ్రంధి సందీప్, ఎంఈవో రామకిషోర్, కొప్పాక జవహర్, బర్ల శ్రీనివాస్, బొబ్బిలి పేర్రాజు, మంకెన వీర్రాజు, మేణ్ణి పార్థు, సచివాలయ సిబ్బంది, కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలులో...



నిడదవోలులో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, విద్యార్థులు

నిడదవోలు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఎక్సైజ్ సీఐ ఆర్.జయరామ్ సతీష్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంత్రి కందుల దుర్గేష్ ఆదేశాలతో ఉద్యోగులు, విద్యార్థులు స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించి, అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. తర్వాత పర్యావరణ పరిరక్షణపై పలువురు మాట్లాడారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: అన్నదేవరపేటలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్‌ని నిషేధించాలంటూ ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు, గ్రామస్థులు, ఉద్యోగులు పాల్గొని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ సూర్యహాస్, ఏపీఎం మంగాయమ్మ, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ రవిప్రకాష్, డ్వాక్రా, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురం: ప్లాస్టిక్ రహిత సమాజానికి ముందుకు రావాలని ఎంపీడీవో రాజ్‌మనోహర్ అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మండల కేంద్రంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టు సెంటర్ వరకు ర్యాలీ చేస్తూ పలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనురాధ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యకమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పలు నినాదాలు చూస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీఎస్ రామారావు, హౌసింగ్ ఏఈ ఏడుకొండలు, ఈవోపీఆర్డీ కే. ఆంజనేయశర్మ, ఉపాధి టీఏ కాంతారావు, ఎంపీటీసీ సభ్యుడు వీ. సత్యనారాయణ, ఇతర నాయకులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్ల విధానం రద్దు చేయాలి

చాగల్లు, జులై 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరాలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన స్మార్ట్‌మీటర్ల విధానాన్ని రద్దుచేయాలని మండల కాంగ్రెస్ నాయకులు శనివారం చాగల్లులో విద్యుత్ సబ్ స్టేషన్‌కు సమీపంలో నిరసన దీక్ష చేపట్టారు. డీసీసీ ప్రెసెడెంట్ టీకే విశ్వేశ్వరరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు రఫీయుల్లా బేగ్, పాలకుర్తి ప్రభాకర చౌదరి, బొనిగే రాంబాబు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పొగాకుతో గిట్టుబాటు ధర

- ఐటీసీ వైస్ ప్రెసిడెంట్ రవీశ్



దేవరపల్లిలో పొగాకును పరిశీలిస్తున్న ఐటీసీ వైస్ ప్రెసిడెంట్ రవీశ్

దేవరపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రైతులు నాణ్యమైన పొగాకు ఉత్పత్తి చేస్తే మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తుందని ఐటీసీ వైస్ ప్రెసిడెంట్ రవీశ్ పేర్కొన్నారు. దేవరపల్లిలోని పొగాకు బోర్డులో పొగాకు వేలం ప్రక్రియను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తాను ఐటీసీ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టానని తెలిపారు. ఎస్ఎల్ఎస్ ఏరియాలో పొగాకుకు మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో ఐటీసీ లీడ్ మేనేజర్ కోటేశ్, పొగాకు రైతు సంఘం నాయకులు కరుటూరి శ్రీనివాసరావు, కాట్రు వీరవెంకట సత్యనారాయణ, యాగంటి సాయిబాబు, ఈలప్రోలు చిన్ని, యద్దనపూడి రవీంద్ర, మాజీ సొసైటీ అధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనపై మహిళలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ శ్రీనివాస్

కొవ్వూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇంటికి ఒక పారిశ్రామిక వేత్తను తయారుచేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమని భారతీయ లఘు పరిశ్రమల అభివృద్ధి బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. శనివారం కొవ్వూరు మండల సమాఖ్య కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా పరిశ్రమల స్థాపనకు అవసరమైన వ్యాపారుల ఎంపిక, రుణ సదుపాయాలకు అవసరమైన ప్రాజెక్టు రిపోర్టు తయారీ, డాక్యుమెంటేషన్, యంత్రాలు, పరికరాలు, ముడి సరుకు, మార్కెటింగ్ సదుపాయాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న రాయితీ పథకాలు, రిజిస్ట్రేషన్లు, అనుమతులు పొందడం, ముద్ర, ప్రధాన మంత్రి ఉపాధి కల్పన, ప్రధానమంత్రి ఆహారశుద్ధి పరిశ్రమల ప్రోత్సాహక కార్యక్రమం, ఏపీ పారిశ్రామిక విధానం, స్టాండప్ ఇండియా కార్యక్రమం వంటి రుణ సదుపాయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళలు, తదితరులు పాల్గొన్నారు.